మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 230 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



# భవిష్యత్ జగనగణనకు ఈ సర్వే ప్రామాణికం కానుంది

- ఈ మేరకు డాక్యుమెంటును కేంద్రానికి పంపుతాం
- గాంధీభవన్‌లో పార్టీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (ప్రజా మంటలు): ప్రభుత్వం చేపట్టబోతున్న బిసి కులగణన దేశానికే రోల్ మోడల్‌గా మార్చాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బిసి కులగణన హామీని నిలబెట్టుకోవడం ద్వారా తెలంగాణను ఆదర్శంగా నిలుపుదామని అన్నారు. రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సోనియాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టి తీరుతామని స్పష్టం చేశారు. కులగణనపై గాంధీభవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి పార్టీ సమావేశంలో పాల్గొన్న సీఎం.. పక్రియపై దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో మన తెలంగాణను మోడల్‌గా పరిగణనలోకి తీసుకునేలా డాక్యుమెంటును కేంద్రానికి పంపుతామని వివరించారు. కులగణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక అబ్జర్వర్లను నియమించాలని రేవంత్ రెడ్డి సూచించారు. బాధ్యతగా పనిచేయాలని కష్టానికి తగిన ఫలితం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా పార్టీ క్షమించదని హెచ్చరించారు. నవంబర్ 31లోగా పక్రియ పూర్తి చేసి భవిష్యత్తు యుద్దానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ నుంచి నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాల్సి ఉందని స్పష్టం చేశారు. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదని అది మెగా హెల్త్ చెకప్ లాంటిదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. నవంబర్ 6 నుంచి తెలంగాణలో కులగణన పక్రియను ప్రారంభించ నున్నారు. దేశంలో తొలిసారిగా ఇక్కడ కులగణన చేపట్టనున్నారు. నవంబర్ 6న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తోంది. ఈమేరకు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. కులగణన తర్వాత ఏయే సంక్షేమ కార్యక్రమాలకు ఎంత నిధులు కేటాయించాలో తెలిసే అవకాశం ఉంది. త్వరలో దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రులు తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో కులగణనపై సమావేశాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవడానికి

మిగతా 2లో..

## తెలంగాణ సచివాలయం సెక్యూరిటీలో మార్పు

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, (ప్రజా మంటలు): సిఎం రేవంత్ భద్రత విషయంలో మార్పులు చేసిన పోలీస్ శాఖ సచివాలయం విషయంలోనూ మార్పులను చేపట్టింది. తెలంగాణ సచివాలయం వద్ద బందోబస్తు నిర్వహించే సెక్యూరిటీలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ప్రత్యేక పోలీసు విభాగం నుంచి టీజీ ఎస్పీఎఫ్‌కు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏక పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీని ఇప్పటికే మార్చేసింది. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులతో ముఖ్యమంత్రి నివాసం వద్ద భద్రత కల్పిస్తున్నది. ఇప్పుడు సచివాలయం బందోబస్తు విషయంలోనూ ప్రత్యేక పోలీసు విభాగం నుంచి టీజీఎస్పీఎఫ్‌కు బాధ్యతలను బదిలీ చేసింది. కాగా, గతంలో ఎస్పీఎఫ్ పర్యవేక్షణలోనే సచివాలయ బందోబస్తు కొనసాగింది. కానీ కొత్త సచివాలయం నిర్మాణం తర్వాత స్పెషల్ పోలీసులకు బాధ్యత అప్పగించారు.

## రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ వేయండి

- స్థానిక ఎన్నికల అంశంలో ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, (ప్రజా మంటలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్లను త్వరగా తేల్చితే స్థానిక ఎన్నికల్లో లబ్ది ఉంటుందని పిటిషనర్ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో విడుదల చేసింది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగించింది. దీనిని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసే బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఒకటి రెండు నెలల పాటు రాష్ట్రంలో బీసీ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక అందిస్తుంది. గతంలో మహారాష్ట్రలో ఇలాగే బీసీ కమిషన్ చేసిన అధ్యయనాన్ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది. ఇక్కడ నివేదిక సమర్పించిన తర్వాత అదేవిధంగా జరిగితే సమయం వృథా అవుతుంది. అందువల్ల ఇప్పుడే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ తరపున మాజీ అడ్వొకేట్ జనరల్ ప్రసాద్ కోర్టును కోరారు.

## నవంబర్ 10న గ్రూప్- 3 హాల్‌టికెట్లు

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో గ్రూప్-3 అభ్యర్థులకు కీలక అప్‌డేట్ వచ్చింది. నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. రెండు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహించనుండగా.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 1; మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పేపర్ -2 నిర్వహించనున్నారు. అలాగే, నవంబర్ 18న పేపర్ 3 పరీక్షను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహిస్తారు. నవంబర్ 10న హాల్ టికెట్లు అందుబాటులోకి రానున్నాయి.గ్రూప్ 3 పరీక్ష మొదటి సెషన్‌కు ఉదయం 8.30గంటల నుంచి, రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1.30గంటల లోపే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి స్తారు. ఉదయం సెషన్‌లో 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 2.30గంటలకు గేట్లు మూసి వేస్తామని.. ఆ తర్వాత ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని తేల్చి చెప్పారు. సెలక్షన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను, క్వశ్చన్‌పేపర్లు జాగ్రత్త చేసుకోవాలని టీజీపీఎస్సీ సూచించింది.



ప్రకటన కర్తలకు పాఠకులకు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**సెలవు**

పండుగ సందర్భంగా అనగా గురువారం కార్యాలయానికి సెలవు శుక్రవారం సంచిక వెలబడదు పునర్దర్శనం శనివారం

## ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, (ప్రజా మంటలు): దీపావళి పండుగ సందర్భంగా ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 3.64 శాతం డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఏ పెంపు 2022 జులై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని తెలిపింది.నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నారు. 2022 జులై ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు.2025 మార్చి 31వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తారు. 90 శాతం 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతారు. విశ్రాంత ఉద్యోగులకు డీఏ బకాయిలు 2025 జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

## హామీలు ఎందుకు అమలు చేయడంలేదు

- శ్వేతపత్రం విడుదల చేయండి - కూనంనేని డిమాండ్
- బిజెపి, బిఆర్‌ఎస్‌లు శాంతిభద్రతల సమస్య సృష్టించే యత్నం చేస్తున్నాయని ఆగ్రహం

హైదరాబాద్, (ప్రజా మంటలు): కాంగ్రెస్ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతోందని... ఎందుకు నెరవేర్చలేక పోతున్నామో ఆ పార్టీ ఆలోచించుకోవాలని అన్నారు. హామీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని.. శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. హైడ్రా.. పెద్దవాళ్ళ గుండెల్లో బాంబ్ కావాలని.. పేదల గుండెల్లో కాదని అన్నారు. మూసీ పునర్జీవ పథకం విషయంలో ప్రభుత్వానికి స్పష్టత లేదని సీపీఐ భావిస్తుందని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పరిస్థితులు గందరగోళంగా తయారు కావడానికి పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. శాంతి భద్రత సమస్యలు సృష్టించడానికి బీఆర్‌ఎస్, బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు కూనంనేని.

**మీడియా రంగంలో అడ్డు అదుపులేకుండా విలీనాలు**

వార్తా 2లో..




## నేటి నుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు

గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకెళ్లాలి

అమరావతి,అక్టోబర్ 30 (ప్రజా మంటలు): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటికీ కొందరికీ ఫ్రీ గ్యాస్ ఎలా తీసుకోవాలనే సందేహం కలుగుతుంది. ఏయే పత్రాలు ఇవ్వాలి..? అని అడుగుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ధరఖాస్తు దారుని వద్ద ఎల్పీజీ కనెక్షన్, ఆధార్ కార్డ్, తెల్ల రేషన్ కార్డు ఉండాలి. ఎప్పటిలాగే మొబైల్ నంబర్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేయాల్సి ఉంటుంది.

## ప్రజా నాడి




## గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరి పత్రం

అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

గల్ఫ్ కార్మికుల సమస్యల అధ్యయనానికి త్వరలో అడ్వయిజరీ కమిటీ

( రామ కిష్టయ్య సంగన భట్ల)



ధర్మపురి అక్టోబర్ 30 (ప్రజా మంటలు) : సౌదీ అరేబియాలో మృతి చెందిన కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య కుటుంబానికి మంగళవారం రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్ గ్రేషియా మంజూరి పత్రం (ప్రొసీడింగ్స్) ను మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక కార్యక్రమంలో అందజేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా (మృతధన సహాయం) ఇవ్వడం దేశ చరిత్రలోనే ప్రథమం అని అన్నారు. గల్ఫ్ కార్మికులు, ఎన్నారైలు తమ సమస్యలు విన్నవించుకోవడానికి హైదరాబాద్ ప్రజాభవన్ లో 'ప్రవాసీ ప్రజావాణి' కౌంటర్ ఏర్పాటు చేశామని, గల్ఫ్ కార్మికుల సమస్యలు అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు చేయడానికి త్వరలో అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు.కాంగ్రెస్ ఎలక్షన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 'గల్ఫ్ గ్యారంటీ' ని అమలు చేసిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు బి. మహేశ్ కుమార్ గౌడ్ కు, మంత్రివర్గానికి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు అందరికీ కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.



మొదటి పేజీ తరువాయి

## భవిష్యత్ జగనగణనకు ఈ సర్వే ప్రామాణికం కానుంది

ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ హామీ మేరకు కులగణన చేస్తున్నామన్నారు. సర్వేతో అందరి సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశమంతా తెలంగాణను అనుసరిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఉపముఖ్యమంత్రి



భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నది బీసీ కులగణన కాదు.. సమగ్ర కులగణన అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కులగణన సర్వేను కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యం ఉన్న విషయంగా తీసుకుందన్నారు. కులగణన ఎక్స్ రే మాత్రమే కాదు మెగా హెల్త్ చెకప్ లాంటిదన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ అన్ని పరిస్థితులు చూశారు... కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కులగణన చేయాలని నిర్ణయించారు. కులగణన నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని అన్నారు. నవంబర్ 2న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానిస్తామని తెలిపారు. డిసెంబర్ 7 నాటికి కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తవుతుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆలోపు సమగ్ర కులగణన సర్వేను హైకోర్టుకు అందిస్తామన్నారు. రాహుల్ ఇచ్చిన మాటను నెరవేర్చబోతున్నామన్నారు. రాహుల్ ప్రధాని కావడానికి తెలంగాణ మోడల్ ఉపయోగపడుతుందన్నారు. నవంబర్ 31 లోగా కులగణన పూర్తి చేస్తామన్నారు. కులగణనపై నవంబర్ 5 లేదా 6 న రాష్ట్రస్థాయి సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యులను చేస్తామని చెప్పారు. కేంద్రం చేపట్టబోయే జనగణనలో ఓబీసీ కులగణను చేర్చాలని కోరుతామన్నారు. ప్రభుత్వ ఆదాయన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచుతామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు.. దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన పక్రియ ఈనెల 6 వ తేదిన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా అందరు సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికారులకు సహకరించాలని సూచించారు. 50 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు. తెలంగాణలో కులగణన పక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారాస నేతలు ప్రభుత్వాన్ని విమర్శించ డమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన కులాలకు చెందిన వారిపై భారాసకు ప్రేమలేదన్నారు. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా బలహీన వర్గాలకు చెందిన వ్యక్తినే కాంగ్రెస్ పార్టీ నియమిం చిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తూ.. అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించని కార్యక్రమాలనూ చేపడుతున్నామన్న విషయాన్ని ప్రతిపక్ష నేతలు గుర్తించాలని హితవు పలికారు.



### శాతావాహన వీసీ ని కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

జమ్మికుంట అక్టోబర్ 30 (ప్రజా మంటలు) :
ఇటీవల నూతనంగా నియమితులైన శాతవాహన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ను ప్రసన్న హరికృష్ణ మరియు వారి మిత్రులు మర్యాద పూర్వకంగా కలిసి వారికి శు భాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగావిశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలల ప్రస్తుత పరిస్థితి గురించి, విద్యార్థుల సమస్యలు, వారి భవిష్యత్తు కోసం గుణాత్మక విద్య గురించి చర్చించారు,ఇట్టి సందర్భంలో విద్యార్థుల భవిష్యత్తు మార్గదర్శనానికి,కళాశాలల అభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలను అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రసన్న హరికృష్ణ తెలిపారు

## గిరిజన విద్యార్థికి ముఖ్యమంత్రి అండ

### ఎంబిబిఎస్ ఫీజు చెల్లింపుకు హామీ



హైదారాబాద్ అక్టోబర్ 30 (ప్రజా మంటలు) :
డాక్టర్ కావాలన్న ఆ గిరిజన విద్యార్థిని కల నెరవేరనుంది. ఎంబీబీఎస్‌లో సీటు సాధించినా కాలేజీ ఫీజు కట్టేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్న సాయి శ్రద్ధకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు.కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం జెండాగూడ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని సాయిశ్రద్ధ నీట్‌లో ఎస్టీ విభాగంలో 103వ ర్యాంకు సాధించారు. మంచి ర్యాంకుతో సీటు సాధించినా ఫీజు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి రాగానే వారు వెంటనే స్పందించారు. ఆ విద్యార్థిని కలను నెరవేర్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.సాయిశ్రద్ధ తల్లిదండ్రులతో కలిసి ముఖ్యమంత్రి గారిని కలవగా, వైద్య విద్యకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించారు. వైద్య విద్య పూర్తి చేయాలన్న కల నెరవేరుతున్నందుకు ఈ సందర్భంగా సాయిశ్రద్ధ, కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## బీసీ కమిషన్ కూలగణనను పారదర్శకంగా చేయాలి

### బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ డిమాండ్



కరీంనగర్ అక్టోబర్ 30 (ప్రజా మంటలు) :
బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఏన్నం ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి, ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్ పాల్గొన్నారు. ఇరువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ కమిషన్ నవంబర్ 1న జరిపే పర్యటన సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశం., బీసీ సంఘాలు మరియు బీసీ కుల సంఘాల వినతి పత్రాల స్వీకరణ వారి యొక్క అభిప్రాయాల స్వీకరణ సమయము ఒక గంట మాత్రమే కేటాయించారు దానిని ఒక గంట నుంచి ఒక రోజుకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఇన్నేళ్ల బీసీ సంఘాల ఆకాంక్షలని పోరాటాలని పరిగణలో తీసుకొని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 27% నుండి 42 శాతానికి పెంచుతామనీ చెప్పిన డిక్లరేషన్ ని అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే కులగనన కార్యక్రమాన్ని నీరు కార్చే ప్రయత్నం చేస్తే ఊరుకోబోయేది లేదని బీసీల ఆకాంక్షలకు అనుగుణంగా బీసీ కమిషన్ సామాజిక న్యాయాన్ని పాటిస్తూ పారదర్శకంగా చేయాలని కోరారు. . ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాచర్ల అంజయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శానగొండ శ్రీనివాస్, బండారి మల్లయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి వంగల రవి గోపాల్, బిసి విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, కదారి ఐలయ్య యాదవ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీని కేంద్రానికి తాకట్టుపెట్టిన చంద్రబాబు

### వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అమరావతి, (ప్రజా మంటలు):
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి తాకట్టుపెట్టారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు ఒక్క అంగుళం తగ్గినా రాష్ట్రమంతా ఉద్యమిస్తామని మీడియా సమావేశంలో హెచ్చరించారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే కూటమి ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని విమర్శించారు. రైతుల కోసం చంద్రబాబు ఏ ఒక్క కార్యక్రమాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు భరోసా కేంద్రాలను, రైతు బీమాకు మంగళం పాడారని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో రైతులకు రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టారని తెలిపారు. వైసీపీ హయాంలో వైఎస్ జగన్ అన్ని రకాలుగా ఆదుకున్నారని పేర్కొన్నారు. సకాలంలో రైతు బీమాను రూ. 900 కోట్లు ప్రీమియం చెల్లించి ఉంటే ఇటీవల వచ్చిన తుఫాన్ కారణంగా రూ. 13,000 కోట్ల పంట పరిహారం బీమా కంపెనీల నుంచి వచ్చేదని అభిప్రాయపడ్డారు. రైతు అంటే చంద్రబాబుకు నచ్చదని అన్నారు. రైతు భరోసా కేంద్రాలను గాలికొదిలేశారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారని తెలిపారు.

## బెయిల్ రద్దుపై కుట్ర శతాబ్దపు జోక్ వైఎస్ షర్మిల



అమరావతి, (ప్రజా మంటలు):
ఏపీ మాజీ సీఎం జగన్ బెయిల్ రద్దుకు కుట్ర జరుగుతుందని పేర్కొనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని వైఎస్ షర్మిల అన్నారు. కుటుంబంలో ఆస్తుల పంపకంలో జరుగుతున్న వివాదంపై మరోసారి ఆమె స్పందించారు. వందశాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూ పై వైఎస్ జగన్ సంతకం చేశారు. బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా? అంటూ ఎద్దేవా చేశారు. 2021లో క్లాసిక్ రియాలిటీ, సండూర్, సరస్వతి షేర్లను ఎలా అమ్మారు? విజయమ్మకు రూ. 42 కోట్లకు షేర్లు ఎలా అమ్మారు? షేర్లు అమ్మడం స్టేటస్ కోను ఉల్లంఘించినట్లు కాదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. షేర్ల బదిలీకి, బెయిల్ రద్దుకు సంబంధం లేదని మీకు తెలుసు కాబట్టే షేర్లను విక్రయించి, సంతకాలు చేశారని ఆరోపించారు. షేర్లు విక్రయించి ఇప్పుడేమో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ బెయిల్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదని విజయమ్మకు తెలుసని అన్నారు. ఈడీ అటాచ్ చేసింది షేర్లు కాదని, రూ. 32 కోట్లు విలువైన కంపెనీ స్థిరాస్తి అని పేర్కొన్నారు. షేర్ల బదలాంపుపై ఎలాంటి ఆంక్షలు, అభ్యంతరాలు తనకు లేవని వెల్లడించారు. స్టేటస్‌కో ఉన్నది షేర్లపై కాదని తెలిపారు. గతంలోనూ ఎన్నో కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. అటాచ్ చేసిన వాటి షేర్లు, స్టాక్‌మార్కెట్‌లో ట్రేడింగ్, బదిలీలు మాత్రం ఆపలేదని అన్నారు. ఈడీ అటాచ్ చేసినందువల్ల షేర్ల బదిలీ చేయకూడదనడం హాస్యాస్పదమని షర్మిల తెలిపారు.



### జనగణన లో కులగణన చేపట్టాలి..


#### -టీ బీసీ జేఏసి అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 30 (ప్రజా మంటలు) :
కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది చేపట్టనున్న జనాభా లెక్కల్లో కులగణన చేయించాలని టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ కోరారు.బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.సుప్రీంకోర్టు తో పాటు 20 రాష్ట్రాల హైకోర్టులు కుల గణనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.దేశంలో 70 ఏళ్ళు పై బడిన వృద్ధులు అందరికీ రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య భీమా పథకం ను ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి తమ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచి పోయే ప్రక్రియ అవుతుందని,దీని ద్వారా ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాల అభివృద్ధికి ఉపయోగం ఉంటుందన్నారు.మంగళవారం నిజామాబాద్ లో జరిగిన బీసీ కమిషన్ బహిరంగ విచారణలో తమ టీబీసీ జేఏసీ నిజామాబాద్ సంఘ ప్రతినిధులతో కలిసి రాత పూర్వకంగా,మౌఖికముగా వినతులు అందజేశామని చెప్పారు.ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు కొండ లక్ష్మణ్,ఉపాధ్యక్షుడు సింగం భాస్కర్,వెల్మల ప్రకాష్ రావు,కస్తూరి శ్రీమంజరి,సింగం పద్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు చార్జీలు నిలిపివేసినందుకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలోసంబరాలు



జగిత్యాల అక్టోబర్ 30 (ప్రజా మంటలు) :
రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పైన వేయాలనుకున్న 18,500 విద్యుత్ చార్జీల భారాన్ని ఆపిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రజల తరుపున సంబరాలు చేయాలన్న బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసిల్ చౌరస్తా వద్ద టపాసులు కాల్చుతూ, బిఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు,జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంతసురేష్ సంబరాలు నిర్వహించారు. విద్యాసాగర్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి బుటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఇది చాలదు అన్నట్టు...ప్రజల మీద భారం మోపాలని కరెంట్ చార్జీలు పెంచాలని 300యూనిట్ల కంటే ఎక్కువ వాడే వారికి 18500కోట్ల భారం మోపాలని కొత్త నాటకం పెట్టింద్రు...ఆ నాటకానికి తెరధించడానికి కేసీఆర్ నాయకత్వంలో కేటీఆర్ ఈ ఆర్ సి మీటింగ్ లో పాల్గొని ప్రజల కోరిక, ప్రజలకు నష్టం జరగొద్దు అనే వాదన వినిపించి ఏ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న అధికారం ఏదైతే ఉన్నదో ఎలక్ట్రిసిటీ అధికారులకు వత్తాసు పలకకుండా న్యాయమైన సమస్య అని, ప్రజల మీద భారం మోపద్దు అని కేటీఆర్ తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. కేటీఆర్ విజ్ఞప్తి మేరకు ప్రజలకు విద్యుత్ భారం మోపకుండా ప్రజలకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నందుకు జగిత్యాల జిల్లా బి ఆర్ యస్ పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దావ వసంతసురేష్ మాట్లాడుతూ, విద్యుత్ బిల్లుల పెంపుపై ఈఆర్సీకి మాజీ మంత్రి,బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విజ్ఞప్తి మేరకు బిల్లుల పెంపు నిర్ణయం ఉపసంహరించుకున్నారని అన్నారు. ఇది నిజంగా శుభపరిణామం. ఇందులో భాగంగానే పట్టణంలోని తహసీల్ చౌరస్తాలో సీఎం కేసీఆర్,మాజీ మంత్రి కేటీఆర్,కవితక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలోనే ఇది చారిత్రత్మాకమైన రోజు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎ ఒక్కనాడు విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలపై భారం వెయ్యాలని చూడలేదన్నారు. ప్రధాన ప్రతిపక్షంలో ఉండి,ప్రజల పక్షాన పోరాడి సఫలీకృతులం అయ్యామని అన్నారు.



# 9 నుంచి యూరప్‌లో శ్రీనివాస కల్యాణోత్సవాలు

తిరుమల, (ప్రజా మంటలు):

టీటీడీ ఆధ్వర్యంలో నవంబరు, డిసెంబరు నెలల్లో యూకే, ఐర్లాండ్, యూరప్?ల్లో ఎనిమిది దేశాల్లోని 13 నగరాల్లో శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు సూర్య ప్రకాష్ వెలగా, కృష్ణ జవాజీ,లు మంగళవారం టీటీడీ ఈవో శ్యామలరావును తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. టీటీడీ సహకారంతో స్థానిక స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలతో కలిసి నవంబరు 9 నుంచి డిసెంబరు 21 వరకు ఏపీ ఎన్ఆర్‌టీ శ్రీనివాస కల్యాణం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఈవోకు తెలిపారు. ఈ తిరు కల్యాణ కార్యక్రమాల్లో టీటీడీ వేదపండితులు వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించనున్నారు. నవంబరు9న బెల్ఫాస్ట(ఐర్లాండ్), 10న డబ్లిన్(ఐర్లాండ్), యూకేలో 16న బేసింగ్‌స్టోక్(యూకే), 17న ఐండోహెూవెన్(నెదర్లాండ్స్), 23న హాంబర్గ్(జర్మనీ), 24న పారిస(ఫ్రాన్స్), 30న వార్సా(పోలాండ్), డిసెంబరు1న స్టాక్‌హెూం(స్వీడన్), 7న మిల్టన్‌కీన్స్(యూకే), 8న గ్లౌసెస్టర్(యూకే), 14న ఫ్రాంక్‌ఫర్ట్(జర్మనీ), 15న బెర్లిన్(జర్మనీ), 21న జ్యూరిచ్(స్విట్జర్లాండ్)లో కల్యాణం నిర్వహించనున్నారు.ం

## ఢిల్లీలో ఏపీ భవన్ నిర్మాణానికి ప్రణాళికలు

### టెండర్లను పిలిచిన ఏపీ ప్రభుత్వం




అమరావతి, (ప్రజా మంటలు):

ఢిల్లీలో ఏపీ నూతన భవన్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది. 'రీ డెవలప్మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ భవన్' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం డిజైన్లకు టెండర్లు పిలిచింది. రాష్ట్ర విభజన తర్వాత ఢిల్లీలో ఏపీ భవన్ విభజన జరిగింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు రెండు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజన ఖరారు చేశారు. రెండు రాష్ట్రాల అధికారుల ప్రతిపాదనకు కేంద్ర హెూం శాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న భవనాలను కలిపి రెండు రాష్ట్రాలు వినియోగించు కుంటున్నాయి. కొత్త భవన్ నిర్మాణం చేపట్టాల్సి రావడంతో ఏపీ ప్రభుత్వం డిజైన్ల ప్రక్రియ మొదలు పెట్టింది. ప్రస్తుతం గోదావరి, స్వర్ణముఖి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడి హౌస్.. మూడు చోట్ల నిర్మాణానికి డిజైన్లు ఆహ్వానించింది. మూడు ప్రదేశాల్లో కలిపి మొత్తం 11.53 ఎకరాల్లో ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ డిజైన్లు కోరింది. బుధవారం సాయంత్రం లోపు ఆసక్తి ఉన్న గుత్తేదారులు తమ 'ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్' ను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. నవంబర్ 28 లోపు తమ ప్రతిపాదనలు సమర్పించాలని రహదారులు, భవనాల శాఖ విజయవాడ సర్కిల్ ఎస్ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. కాగా ఢిల్లీ అశోకా రోడ్డుతో పాటు మాధవరావు సింథియా మార్గ్‌లో కలిపి రెండు రాష్ట్రాలకు 19.733 ఎకరాల భూమి ఉంది. ఇందులో తెలంగాణ వాటాగా 8.245 ఎకరాలు, ఏపీ వాటాగా11.536 ఎకరాలు కేటాయిస్తూ కేంద్ర హెూంశాఖ నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు శబరి బ్లాక్‌లో 3.00 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 5.245 ఎకరాలు కేటాయించారు. అలాగే ఏపీకి 5.781 ఎకరాల్లో ఉన్న గోదావరి బ్లాక్, స్వర్ణముఖి బ్లాక్‌ను కేటాయిస్తూ నిర్ణయించారు. అలాగే ఏపీకి నర్సింగ్ హాస్టల్‌లో 3. 359 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 2.396 ఎకరాలు కేటాయిస్తూ కేంద్ర హెూంశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. ఢిల్లీలో తెలుగువారికి చిరునామాగా నిలిచే ఏపీ భవన్ ఆస్తుల పంపకం ఎట్టకేలకు పూర్తి అయింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఆస్తుల పంపకం కొలిక్కి రాకపోవడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపింది. తాజాగా ఏపీ భవన్ విభజనపై కేంద్రహెూంశాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సమయంలోనే ఉమ్మడి ఆస్తులను ఏపీ, తెలంగాణకు 52:48 నిష్పత్తిలో పంచారు.

# వైసీపీ పాలనలో ఎన్ని డబ్బులు పెట్టిన ఇసుక దొరకలేదు

### ఉచిత ఇసుక కార్యక్రమంపై జన ఆనందం

### ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు,అక్టోబర్ 30 (ప్రజా మంటలు):

వైసీపీ పాలనలో ఇసుక ధరలు ఆకాశాన్నంటాయని, ఎన్ని డబ్బులు పెట్టిన దొరకని పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. రూరల్ టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన 'ఉచిత ఇసుకపై జన ఆనందం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఉచిత ఇసుక విధానంపై భవన నిర్మాణ కార్మికులు, బిల్డర్లు, నిర్మాణదారులు, ట్రాక్టర్ల యజమానులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో ట్రక్కు ఇసుక ధర రూ.5 వేలు నుంచి రూ.6 వేలు ఉండేదని.. అయినా ఇసుక దొరికేది కాదన్నారు. ఇప్పుడు అదే ఇసుక రూ.1000 వస్తోందన్నారు. వైసీపీ హయాంలో సీఎం జగనే ఇసుక వ్యాపారం చేశారని, ఎమ్మెల్యేలకు ప్రశ్నించే అవకాశం ఉండేది కాదని, ఏజెంట్లుని పెట్టుకుని ఇసుక వ్యాపారం నడిపించారని ఆరోపించారు.వైసీపీ హయాంలో ఇసుక ట్రాక్టర్లకు లోడ్ చేసేవాళ్ళు కాదని, టిప్పర్లు లోడ్ చేసేవాళ్ళని ఎమ్మెల్యే కోటంరెడ్డి అన్నారు. ఎందుకంటే ట్రాక్టర్లు పేదోళ్ళవి.. టిప్పర్లు ముఖ్యమంత్రివి.. ఇసుక టిప్పర్లు టచ్ చేస్తే సీఎం కార్యాలయం నుంచి కాల్ చేసే వాళ్లని.. ఎస్పీలు, కలెక్టర్లు ఏజంట్లుగా పని చేశారని అన్నారు. 11 సీట్లు ఇచ్చి జనం ఛీ కొట్టి తిరస్కరించారని.. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి వైసీపీ నేతలు సహకరించాలని సూచించారు. ఇసుక విషయంలో వైసీపీ మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. జగన్ పాలనలో ఇసుక విషయంపై ఎమ్మెల్యే, ఎంపీలకు



మాట్లాడే హక్కు కూడా ఉండేది కాదన్నారు. జగన్ రాష్ట్రాన్ని దివాలా తీయిస్తే, చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. ఇసుక కొల్లగొట్టి జగన్ ప్రజల నెత్తిన భారం పెట్టారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేరుస్తున్నారని.. 'ఇసుక అధిక ధరల అంతం.. చంద్రబాబు పంతం' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# బంగారం ధరల పరుగులు

### దీపావళికి కలిసిరాని కాలం - పెళ్లిళ్ల సీజన్ కోసం వ్యాపారుల చూపు



ముంబై,అక్టోబర్30(ప్రజా మంటలు):

దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గుతున్నాయి. ధరల కారణంగా బాగా డబ్బున్న వాళ్లు తప్ప పేద, మధ్యతరగతి ప్రజలకు బంగారం అందుబాటులో ఉండడం లేదు. బాంగారం ఏకంగా 80వేలు దాటడం కలవరపెడుతోంది. పెళ్లిళ్ల సీజన్ ఆరంభం కావడం, ధనత్రయోదశి పండగలు వచ్చినా బంగారం కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయి. బంగారం ధరలు స్థిరంగా ఉండడం లేదు. 80వేల మార్కును దాటిన తరవాత కిందికి దిగి రావడం లేదు. రాకుండా వ్యాపారులు కూడా తమవంతు యత్నాలు చేస్తున్నారు. మరోవైపు బంగారం ధర స్థిరంగా ఉన్నప్పటికీ, అటు వెండి ధరలు మాత్రం పెరిగాయి. ఇక కిలో వెండి ధర రూ. లక్షకు చేరుకుంది. పరిశ్రమల యూనిట్లు, నాణెపు తయారీ పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగింది. పుత్తడి ధరలు పెరగడంతో గత సంవత్సరంతో పోలిస్తే అమ్మకాలు కనీసం 30 నుంచి 50 శాతం తగ్గుతాయని మార్కెట్ వర్గాల అంచనా. అయితే దీపావళి, ధంతేరస్ పర్వదినాల సందర్భంగా కొనుగోళ్లు పుంజుకుంటాయని ఆభరణాల పరిశ్రమ ఆశించింది. రికార్డు స్థాయిలో ఎగిసిన పుత్తడి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో కస్టమర్ల తాకిడి ఆశాజనకంగా వుంటుందని భావిస్తున్నారు. దేశీయంగా రిటైల్ మార్కెట్లో కూడా బంగారం పెరుగుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో పసిడి లాభాల సిరులు కురిపిస్తుందనే అంచనాల్లో ఉన్నారు. దీపావళి అంటే దివ్వెలు, వెలుగుల సంబరం మాత్రమేకాదు. పసిడి కాంతుల కళకళలు కూడా. దసరా, దీపావళి పండుగ సీజన్ వచ్చిందంటే నగల వ్యాపారులకు బోలెడన్ని ఆశలు. లక్ష్మీదేవిని పూజించడం ఎంత ముఖ్యంగా భావిస్తారో... దీంతో పాటు బంగారం గానీ, ఏదో ఒక కొత్త వస్తువు కొనడం కూడా అంతే ఆనవాయితీ వస్తున్న క్రమంలో వారికి భారీ అంచనాలే ఉన్నాయి. అయితే ఇటీవల రికార్డు స్థాయికి చేరిన పసిడి దరలు దీపావళి నాటికి దిగి వస్తాయా అని కొనుగోలుదారులు ఆశగా ఎదురుచూస్తోంటే.. కొనుగోళ్లతో తమ షాపులు కళకళ లాడతాయా లేదా అని వ్యాపారులు ఆందోళనపడు తున్నారు. కొనుగోలుదారులు దీపావళికి ఎంతో కొంత బంగారాన్ని తమ సొంతం చేసుకోవా లనే ఆలోచనలో ఉంటారు. అయితే ఆకాశా న్నంటిన ధరలు మరింత దిగిరాకపోతాయా అనే మీమాంసలో చాలా మంది కొనుగోలు దారులున్నారు. క్షణక్షణానికి మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో పుత్తడి ధర ఏ రోజు ఎంత పెరుగుతుందో.. ఎంత తగ్గుతుందో అంచనా వేయడం ఒకింత కష్టం గా మారింది. ఇదిలా ఉంటే అంతర్జాతీయ పరిస్థితులు, గ్లోబల్‌గా ఆర్థిక వ్యవస్థ మంద గమనం, ట్రేడ్‌వార్ తదితర కారణాల రీత్యా మొత్తం వ్యాపారం తక్కువగా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. తక్కువ నుండి మధ్య స్థాయి వరకు జరిగే కొనుగోళ్లు తీవ్రంగా ప్రభావితమవుతాయని చెప్పారు. ధరలు పెరిగినా రానున్న పెళ్లిళ్ల సీజన్ కూడా తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

## చిత్రాల్లో దీపావళి పాటలకు ప్రత్యేకత

విజయవాడ,(ప్రజా మంటలు):

దీపావళి ప్రత్యేకతను, దాని విశిష్టతను చెప్పడానికి అనేక సినిమాల్లో అనేక పాటలు వచ్చాయి. సినీ కవులు పాటల్లో దాని పరమార్ధాన్ని ఇనుమడింపజేశారు. తెలుగునాట దీపావళిపై వచ్చిన పాటలు తక్కువే అయినప్పటికీ వాటి మహత్యం మాత్రం చిన్నపాటిది కాదు. బ్లాక్ అండ్ వైట్ చిత్రాల కాలంలో వచ్చిన పాటల వైభవం ఇప్పటికీ ఏమాత్రం వన్నె తగ్గలేదు. ఇందుకు ఉదాహరణ.. విచిత్రబంధం సినిమాలో ఆచార్య ఆత్రేయ రాసిన 'జీవితమే ఒక దీపావళి.. చీకటి వెలుగుల రంగేళీ'. ఇప్పటికీ ఎప్పటికీ మర్చిపోలేని దీపావళి పాట ఇది. తరాలు మారుతున్నా ఆదరణ తగ్గని పాట అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అలాగే అనేక పాటలుఅనేక సినిమాల్లో దర్శనమిస్తాయి.

## నిబంధనల మేరకే టపాసులకు అనుమతి

కడప,(ప్రజా మంటలు):

నిబంధనలను పాటించకుండా దీపావళి పండుగ రోజు టపాసులు కాలిస్తే చర్యలు తీసుకుంటామని కడప పోలీసులు హెచ్చరించారు. బాణాసంచా కాల్చడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉత్తర్వులు ఉన్నాయని అన్నారు. టపాసుల పొగ ఊపిరి తిత్తుల మీద పడి మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కావున టపాసులు కాల్చే వాళ్లు తప్పక నిబంధనలు పాటించాలన్నారు. టపాసులు కొనేవారు, కాల్చేవారు మాస్కులు ధరించాలన్నారు.

## ఏపీ సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈఓ భేటీ

అమరావతి,(ప్రజా మంటలు):

నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం ఏపీ సీఎం చంద్రబాబుతో బుధవారం భేటీ అయ్యారు. ఏపీ సచివాలయంలో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. విజన్ డాక్యుమెంట్-2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా నవ్యాంధ్రను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా, ఏడాదికి 15 శాత వృద్ధిరేటు సాధన ధ్యేయంగా ప్రణాళికను రూపొందించామని సీఈవోకు వివరించారు.కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా , నియోజకవర్గం వారిగా లక్ష్యాలను తయారు చేసుకున్నామని వెల్లడించారు. వ్యవసాయం, ఆక్వా కల్చర్ రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను రూపొందించామని నీతి ఆయోగ్‌కు వివరించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ఈజీ ఆఫ్ లీవింగ్, మౌలిక సదుపాయాలు, జనాభా నిర్వాహణ, డేటా సెంటర్లు, ఏఐతో వృద్ధిరేటును పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సలహాదారు, డైరెక్టర్లు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పంచాయితీలను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్రం

### కేంద్రం నిధులు ఇచ్చినా దారి మళ్లించిన రేవంత్

### రు.1200కోట్లు విడుదల చేస్తే..కేవలం 200 కోట్లు ఖర్చు

### సర్కార్ తీరుపై మండిపడ్డ బిజెపి ఎంపి రఘునందన్ రావు



హైదరాబాద్, (ప్రజా మంటలు):

గ్రామాల అభివృద్దిని కాంక్షించి కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని బిజెపి మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గ్రామాలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో పంచాయతీ సెక్రటరీలు కూడా సొంత డబ్బుతో పనులు చేయించారన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గ్రామాలు బాగుండాలని కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని రఘునందన్ రావు అన్నారు. ఆరునెలల క్రితం కేంద్రం 1200 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్ల నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మిగిలిన రూ.1000 కోట్ల నిధులను రేవంత్‌రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్న రఘునందన్.. పల్లె ప్రగతికి నిధులు వెచ్చించడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని.. కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన నిధులు దారి మళ్లించారని మండిపడ్డారు. ఆ బిల్లులు ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.600 కోట్లు పెండింగ్‌లో పడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెకమండేషన్ మేరకు రూ.500 కోట్లు విడుదల చేసిందని.. నేషనల్ హెల్త్ మిషన్ కోసం 300 కోట్ల రూపాయలు విడుదల చేసిందని చెప్పారు. హెల్త్ సెంటర్ నిర్మాణం చేయాలని చెప్పిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో గ్రామాలలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేసినా తెలంగాణ సర్కార్ వాటిని దారి మళ్లించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కావాలి కానీ కేంద్రం పేరు చెప్పేందుకు మనసు రాదంటూ మండిపడ్డారు. నియోజకవర్గానికి 3,500 ఇల్లు కట్టిస్తామని చెప్పిందని.. వాటిని కట్టేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని.. ఆ నిధులను కూడా అర్బన్ మిషన్ కింద సేకరిస్తోందన్నారు. వాటిని ఎవరు పంచాలనేది దానిపై కొట్లాట మొదలైందన్నారు. కలెక్టర్‌లతో కాకుండా గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల చేతుల మీదుగా ఆ నిధులు అందజేస్తామని చెబుతున్నారన్నారు. మునిసిపాలిటీలలో 250 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం విడుదల చేసిందన్నారు. మా పైసలు తీసుకుని మా భాగస్వామ్యం లేకుండా ఇళ్లను పంచిపెడితే కచ్చితంగా అడ్డుకుంటాం. ఇందిరమ్మ కమిటీలు చెల్లుబాటు కావు. ప్రతి స్కీంకు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లు పెట్టే భావదారిద్యం ఉంది. మూసీ శుద్ధి, సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు . అభివృద్ధి పేరుతో కార్పోరేట్ కంపెనీలకు పనులు అప్పజెబితే మాత్రం వ్యతిరేకిస్తాం. మూసీకి కొండ పోచమ్మ సాగర్ నుంచి నీరు తెస్తే 1500 కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. మల్లన్న సాగర్ నుంచి నీరు తెస్తే 7వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. పేదోళ్లు కట్టిన ఇంటి వద్ద 50 మీటర్ల దూరం అభివృద్ధి చేస్తాం అంటున్నారు. మూసీ అభివృద్ధిలో క్విడ్ ప్రోక్రో ఉన్నట్లు అనుమానం ఉంది. ప్రజలు బీఆర్ఎస్‌కు సీఆర్ఎస్ ఇచ్చారు.. వారిని ఫాం హౌస్‌లకు పరిమితం చేశారు. పేదోళ్లకు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇస్తుంది. కుక్కతోక పటాకులు పేలుస్తారా .. సుతీల్ బాంబు పేలుస్తారా చూడాలి. అదిపేలుస్తాం ఇది పేలుస్తాం అని బ్రేకింగ్ ప్లేట్ల కోసం మాట్లాడకుండా అవినీతిపరులను అరెస్టు చేస్తే మేం స్వాగతిస్తాం అని ఎంపీ రఘునందర్ రావు వెల్లడించారు.

# బ్లూస్టార్ ఆపరేషన్ కు బలైన ఇందిరా ప్రియదర్శిని

## అక్టోబర్ 31.. ఇందిరా గాంధీ వర్ధంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

భారత దేశానికి మూడవ ప్రధాని, దేశపు మొట్టమొదటి, ఏకైక మహిళా ప్రధానమంత్రి, 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధానమంత్రిగా పనిచేసిన శ్రీమతి ఇందిరాగాంధీ అక్టోబరు 31, 1984 న్యూఢిల్లీ లోని సఫ్దార్‌జంగ్ రోడ్డు లోని తన నివాసంలో 09:20 కు ఆమె తమ అంగరక్షకులయిన సత్వంత్‌సింగ్, బియాత్‌సింగ్ లచే హత్య గావింప బడ్డారు. ఈ హత్య అమృత్‌సర్ లోని స్వర్ణ దేవాలయంలో భారత సైన్యం జూన్ 1984 న జరిపిన ఆపరేషన్ బ్లూస్టార్ కు ప్రతీకారంగా జరిగింది. ఈ దారుణ సంఘటన పూర్వాపరాలు పాఠకులకు తెలిపే ప్రయత్నం ఇది.

1984 అక్టోబర్ 30 మధ్యాహ్నం ఇందిరా గాంధీ చేసిన చివరి ప్రసంగాన్ని ఎప్పటి లాగే ఆమె సమాచార సలహాదారు హెచ్‌వై శారదాప్రసాద్ తయారు చేశారు. ఆరోజు ఆమె ముందుగా తయారు చేసుకున్న ప్రసంగ పాఠం కాకుండా సొంతంగా మాట్లాడారు. ఆమె మాట్లాడే తీరులోనూ మార్పు కనిపించింది. ఇదిర ప్రసంగం ఇలా సాగింది: "నేనీ రోజు ఇక్కడున్నాను. రేపు బహుశా ఇక్కడ ఉండక పోవచ్చు. నేను ఉంటానా, ఉండనా అన్న దానిపై నాకేమీ బాధ లేదు. నేను సుదీర్ఘ కాలమే జీవించాను. నేను ప్రజాసేవలో నా జీవితాన్ని గడిపినందుకు గర్వపడుతున్నా. నేను నా చివరి శ్వాస వరకూ సేవ చేస్తూనే ఉంటాను. నేను చనిపోతే నా ఒక్కో రక్తం బొట్టు దేశాన్ని పటిష్టం చేయడానికి తోడ్పడుతుంది." ఆ రాత్రి ఢిల్లీకి చేరుకునే సరికి ఇందిర బాగా అలసి పోయారు. ఆ రోజు రాత్రి ఆమె చాలా తక్కువ సేపు నిద్రపోయారు. ముందు గదిలో పడుకున్న సోనియా ఉదయం 4 గంటల సమయంలో ఆస్థమా మందు వేసుకోవడం కోసం బాత్రూంకు వెళ్లినప్పుడు ఇందిర మెలకువతోనే ఉన్నారు. ఆమె కూడా తన వెనుకే బాత్రూం వరకూ వచ్చారనీ, మందు వెదకడంలో తనకు సహాయం చేశారనీ సోనియా గాంధీ తన పుస్తకం 'రాజీవ్'లో రాశారు. మళ్లీ ఇబ్బంది కలిగితే తనను పిలవమనీ, తాను మెలకువ తోనే ఉంటానని ఇందిర తనకు చెప్పారని సోనియా రాశారు.

తక్కువ అల్పాహారం తీసుకుని, ఉదయం ఏడున్నరకల్లా ఇందిర తయారయ్యారు. ఆ రోజు ఆమె నల్లటి అంచున్న కాషాయ రంగు చీర కట్టుకున్నారు. మొదటి అపాయింట్‌మెంట్ పీటర్ ఉస్తీనోవ్‌తో. ఆయన ఇందిరా గాంధీపై ఒక డాక్యుమెంటరీ తీస్తున్నారు. ఒక రోజు ముందు జరిగిన ఒడిశా పర్యటనలో కూడా ఉస్తీనోవ్ ఆమెను చిత్రీకరించారు. మధ్యాహ్నం ఆమె బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి జేమ్స్ కాలెఘన్‌నూ, మిజోరం నాయకుడొకరినీ కలవాల్సి ఉంది. ఆ రాత్రి ఆమె బ్రిటన్ రాకుమారి యాన్‌కు విందు ఇవ్వాల్సి ఉంది. అల్పాహారం తర్వాత మేకప్ మ్యాన్ ఆమె ముఖంపై పౌడర్, బ్లషర్ అద్దుతుండగా డాక్టర్ కేపీ మాథుర్ అక్కడికి చేరుకున్నారు. ఆమెను చూడడానికి ఆయన రోజూ వచ్చే సమయం అదే. ఆమె డాక్టర్ మాథుర్‌ను లోపలికి పిలిచి అక్కడే మాట్లాడారు. తొమ్మిది గంటల 10 నిమిషాలకు ఆమె బయటికి వచ్చినప్పుడు ఎండ తీవ్రంగా ఉంది. ఆమెపై ఎండ పడకుండా ఉండేందుకు ఓ సైనికుడు నారాయణ్ సింగ్ నల్లరంగులో ఉన్న గొడుగును పట్టుకొని ఆమె పక్కన నడుస్తున్నారు. ఆమెకు కాస్త వెనకాల ఆర్కే ధావన్, ఇందిరా గాంధీ వ్యక్తిగత సహాయకులు నాథు రామ్ ఇంకొంచం వెనుక ఉన్నారు. అందరి కన్నా వెనుక ఆమె ప్రైవేట్ సెక్యూరిటీ ఆఫీసర్ సబ్ ఇన్స్పెక్టర్ రామేశ్వర్ దయాళ్ ఉన్నారు.

ఇందిర అక్బర్ రోడ్ వైపు నుంచి వికెట్ గేట్ వైపు వెళు తున్నప్పుడు ఆమె ధావన్‌తో మాట్లాడు తున్నారు. ఆరోజున కార్యక్రమాల గురించి ధావన్ ఆమెకు వివరిస్తున్నారు. ఇంతలో అక్కడ డ్యూటీలో ఉన్న ఓ సెక్యూరిటీ గార్డు బియాంత్ సింగ్ రివాల్వర్ తీసి ఇందిరా గాంధీపై కాల్పులు జరిపాడు. బుల్లెట్ ఆమె కడుపులో దిగింది. పాయింట్ బ్లాంక్ రేంజిలో మరో రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. దీంతో ఆమె భుజం, గుండె, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి ఐదడుగుల దూరంలో సత్వంత్ సింగ్ తన థామ్సన్ ఆటో కార్బైన్ గన్ పట్టుకొని అక్కడే నిలబడి, ఇందిరా గాంధీ కింద పడుతున్నప్పుడు దిగ్భ్రాంతి చెంది కదలలేక పోయాడు. బియాంత్ సింగ్ అతనిని కాల్పులు జరపమని గట్టిగా అరిచాడు. సత్వంత్ సింగ్ వెంటనే తన థామ్సన్ ఆటో కార్బైన్‌లో ఉన్న మొత్తం 25 బుల్లెట్లను ఆమె శరీరంలోకి దించాడు. అప్పుడు అందరికన్నా వెనకాల నడుస్తూ వచ్చిన రామేశ్వర్ దయాళ్ ముందుకు పరిగెత్తే సమయాన పెట్టాడు. కానీ ఆయన ఇందిరా గాంధీ దగ్గరకు చేరుకోక ముందే తొడ, కాళ్లపై సత్వంత్ జరిపిన కాల్పులతో కిందపడి పోయాడు. అప్పుడే బియాంత్ సింగ్, సత్వంత్ సింగ్ తమ ఆయుధాలను కింద పడేసి "మేమేం చేయాలను కున్నామో చేసేశాం. ఇప్పుడు మీరు ఏం చేయాలను కుంటున్నారో చేసుకోండి." అన్నారు. దగ్గరలో ఉన్న ఓ రూమ్ నుంచి ఐటిబీపీ దళాలు పరిగెత్తుకొచ్చి సత్వంత్ సింగ్‌ను అదుపులోకి తీసు కున్నాయి. ఎప్పుడూ అక్కడ ఓ అంబులెన్స్ ఉండేది. కానీ, ఆ రోజు డ్రైవర్ ఎందుకో రాలేదు. అప్పుడే ఇందిరా గాంధీ రాజకీయ సలహాదారు మఖన్ లాల్ ఫోతేదార్ కారు తీయండని అరిచాడు.ఇందిరమ్మను ఆర్కే ధావన్, భద్రతా అధికారి దినేష్ ఇద్దరూ అక్కడి నుంచి లేపి తెల్లటి అంబాసిడర్ కారు వెనుక సీటులో పడుకో బెట్టారు. ముందు సీట్లో ధావన్, ఫోతేదార్, డ్రైవర్ ముగ్గురూ కూర్చున్నారు. సోనియా గాంధీ అరుస్తూ పరిగెత్తుకుని వచ్చారు. రక్తసిక్తమైన ఇందిర తలను సోనియా గాంధీ తన ఒడిలో పెట్టుకున్నారు. కారును వేగంగా ఎయిమ్స్ వైపు కు తీసుకెళ్లారు. సోనియా గాంధీ గౌన్ ఇందిరా గాంధీ రక్తంతో తడిసి పోయింది. కారు తొమ్మిది గంటల 32 నిమిషాలకు ఎయిమ్స్‌కు చేరింది.

ఎమర్జెన్సీ వార్డు గేటు తెరిచి ఇందిరా గాంధీని కారు నుంచి కిందకి దింపేందుకే మూడు నిమిషాల సమయం పట్టింది. అప్పుడు అక్కడ ఒక్క స్ట్రెచర్ కూడా అందుబాటులో లేదు. ఎలాగోలా ఒక స్ట్రెచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందిరా గాంధీని కారు నుంచి బయటకు తీసుకు వస్తున్నపుడు అక్కడున్న డాక్టర్లు కంగారు పడుతూ, వెంటనే ఎయిమ్స్ సీనియర్ కార్డియాలజిస్టుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కొద్ది నిమిషాల్లోనే డాక్టర్ గులేరియా, డాక్టర్ ఎంఎం కపూర్, డాక్టర్ ఎస్ బలరాం అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఎలక్ట్రో కార్డియోగ్రామ్‌లో ఇందిరా గాంధీ గుండె ఎక్కడో పని చేస్తున్నట్లుగా చూపిస్తోంది కానీ పల్స్ రేట్ మాత్రం చూపించడం లేదు. ఒక డాక్టరు ఆమె ఊపిరి తిత్తులకు ఆక్సిజన్ చేరాలని, ఆమె మెదడు పని చేయాలని ఆమె నోటి ద్వారా శ్వాస నాళంలోకి ఒక ట్యూబు వేశాడు. ఇందిరా గాంధీ శరీరంలోకి 80 బాటిళ్ల రక్తాన్ని ఎక్కించారు. "ఆమెను చూసిన వెంటనే ఆమె ఇక లేరని అనుకున్నాను. దాన్ని నిర్ధారించేందుకు ఈసీజీ స్కానింగ్ చేశాం. అప్పుడే అక్కడున్న ఆరోగ్యశాఖ మంత్రి శంకరానంద్‌ను ఇప్పుడేం చేద్దాం అని అడిగా. ఆమె మరణించారని ప్రకటించాలా? అని అడిగితే ఆయన వద్దన్నారు. ఆ తర్వాత ఆమెను ఆపరేషన్ థియేటర్‌లో తీసుకెళ్లాం" అని డాక్టర్ గులేరియా పేర్కొన్నారు. డాక్టర్లు ఆమె శరీరాన్ని హార్ట్ అండ్ లంగ్ మెషీన్‌పై పెట్టారు. ఈ మెషీన్ వల్లే ఆమె రక్త ఉష్ణోగ్రత 37 డిగ్రీల నుండి 31 డిగ్రీలకు పడిపోయింది.

ఆమె చనిపోయారని తెలిసినా ఎయిమ్స్ ఎనిమిదో అంతస్తుపై ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఆమెను తీసుకెళ్లారు. కాల్పులతో ఆమె కాలేయంలో కుడి భాగం ఛిద్రమైందని నిర్ధారించారు. ఆమె పెద్ద ప్రేగులో దాదాపు 12 రంధ్రాలయ్యాయి. చిన్న ప్రేగు కూడా దాదాపు దెబ్బతింది. ఓ ఊపిరితిత్తి లోకి బుల్లెట్ దూసుకెళ్లింది. బుల్లెట్లతో ఆమె వెన్నెముక కూడా దెబ్బతింది. కేవలం ఆమె గుండె మాత్రమే సురక్షితంగా ఉంది. ఇందిర మరణించారని కాల్పులు జరిపిన నాలుగు గంటల తర్వాత ప్రకటించారు. దాదాపు రెండు గంటల 23 నిమిషాలకు ఇందిరా గాంధీ ఇక లేరని ప్రకటించారు.

ఇందిరా గాంధీపై ఇలాంటి దాడి జరగొచ్చనే విషయంపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ముందే ఆందోళన వ్యక్తం చేశాయని ఇందిరా గాంధీ జీవిత చరిత్ర రాసిన ఇందర్ మల్హోత్రా పేర్కొన్నారు. సిక్కు భద్రతా సిబ్బందిని మొత్తం ఆమె ఇంటి నుంచి తీసేయాలని ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సిఫారసు కూడా చేశాయి. కానీ దీనికి సంబంధించిన ఫైలు ఇందిరా గాంధీ వద్దకు వెళ్ళినప్పుడు ఆమె ఆగ్రహించి "ఆరింట్ వి సెక్యులర్ ? (మేము లౌకిక నాయకులం కామా?) అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఒకేసారి ఇద్దరు సిక్కు భద్రతా సిబ్బందిని ఆమె వద్ద డ్యూటీలో ఉంచ కూడదని నిర్ణయించారు. సందర్భం కలిసొచ్చి బియాంత్, సత్వంత్ ఇద్దరూ ఒకేచోట ఉండి ఆపరేషన్ బ్లూ స్టార్ కి ఇందిరా గాంధీపై ప్రతీకారం తీర్చుకున్నారు.

# "వేయి వెలుగుల కాంతుల్ని పంచే దీపావళి"



మన భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో సంస్కృతికి ప్రతిబింబంగా జరుపుకొనే పండుగలలో దీపావళి ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. పిల్లలు పెద్దలు ఎంతో ఉత్సాహం, ఉల్లాసంతో సర్వమత సమ్మేళనాన్ని పాటిస్తూ అందరూ కలిసిమెలిసి వెలుగు తోరణాలతో వేడుకగా చేసుకుంటారు. ఇలా మానవ స్వభావంలోనే వెలుగు రవ్వలు ఉత్సాహానికి సంకేతం అని తెలుస్తుంది. కొన్ని యుగాల క్రితం ఈ వెలుగులు విరజిమ్మే వేడుకను దివ్యత్వంగానూ, ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా ప్రతిష్టించారు. ఈ పండుగ ఒక వేడుకగా కాకుండా దేవతల అనుగ్రహం పొందే పూజా విధానం అందర్నీ ఆనందపరిచే విధంగా పూర్వీకుల పట్ల, పెద్దలపట్ల ప్రేమ ఆప్యాయతలు... ఇవన్నీ కూడా ఈ దీపావళి పండుగతో ముడిపడి ఉన్నాయి. అందుకే ఈ దీపావళి రోజున అందరూ కలిసిమెలిసి ప్రేమను పంచుకుంటూ ఆనందంగా ఈ వేడుకను జరుపుకుంటారు.

ఈ పండుగ ఆశ్వీయుజ మాసంలో అమావాస్య రోజున వస్తుంది. చివరి మూడు రోజులు అంటే త్రయోదశి, చతుర్థి, అమావాస్య అలాగే కార్తీక మాసం మొదటి రెండు రోజులు పాడ్యమి, విధియ ఈ ఐదు రోజులు ఒక పండుగలా జరుపుకుంటారు. మన భారతీయులు ఇలా జరుపుకునే ఈ దీపావళి పండుగ వెనుక అనేక పురాణ గాధలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు సత్యభామ సమేతంగా నరకాసురుని సంహరించడం, బలి చక్రవర్తి వామనుడికి సామ్రాజ్యాన్ని దానం చేయడం, శ్రీరాముడు రావణుడిని సంహరించిన తర్వాత పట్టాభిషిక్తుడవడం, నరక విముక్తి కొరకు యమ ప్రార్థన, విక్రమాదిత్యుని పట్టాభిషేకం,... ఇలా ఇవన్నీ కూడా దీపావళి రోజునే జరిగాయి.

ఇలా ఈ పండుగలు కాలంతో వచ్చే రుతువుల మార్పులు అంటే ఒక్కొక్క కాలంలో ప్రకృతిలో వచ్చే మార్పులతో పాటు ఖగోళంలో కూడా వాటి ప్రభావం ఎలా ఉంటుందో తెలుసుకుని దాన్ని మనకి అనుకూలంగా మార్చుకోవడం కోసం ఋషులు ఈ పర్వదినాలని మనకు శోభయమానంగా ఏర్పాటు చేశారు. ఒక్కో మాసానికి ఒక్కో ప్రత్యేకతతో ఒక్కో పండుగకి ఒక్కో దేవతను ఆరాధిస్తాం. ఎంతో వైవిధ్యంతో కూడుకున్న ఈ పండుగలు శరన్నరాత్రులతో మొదలుపెట్టి అమ్మవారిని ఆరాధిస్తాము శుక్లపక్షంలో. అలాగే కృష్ణపక్షంలో చివరికి అమావాస్య వస్తుంది. అప్పుడు కూడా అమ్మవారి ఆరాధనతోనే పూజని పరిపూర్ణం చేసుకుంటాము.

ఈ నరక చతుర్దశి రోజు ఉషోదయానికి గంట ముందు చిన్న చిన్న జలాశయాల నుంచి సముద్రం వరకు అన్నింట గంగాదేవి ఉంటుంది. అలాగే నువ్వుల నూనెలో ఈ ఒక్కరోజు లక్ష్మీదేవి ఉంటుంది. అందుకే తెల్లవారుజామున మాడుకి, ఒంటికి నువ్వులు నూనె రాసుకుని అభ్యంగన స్నానం చెయ్యాలి. ఈరోజు సూర్యోదయానికి ఒక గంట ముందే దేవతలకు, పెద్దలకు తల్లిదండ్రులకు హారతులిచ్చి వారి దీవెనలను పొందితే మనకు శుభం కలుగుతుంది. తెల్లవారుజామున స్నానం చేసేటప్పుడు దక్షిణ దిక్కుకు తిరిగి "సీత లోష్ట సమాయుక్త/ సంకట దళాన్విత హరపాప/ మపామార బ్రహ్మ మాన్య పునః పునః/" అంటూ శ్లోకం చదివి ఉత్తరేణి మొక్కను తల చుట్టూ మూడుసార్లు ఎవరికి వారే తిప్పుకొని ఆ తర్వాత ఉత్తర దిక్కుకు తిరిగి నువ్వుల నూనె రాసుకుని నలుగు పెట్టుకుని తల స్నానం చేస్తారు. తదుపరి అన్నదమ్ములకు, అక్కచెల్లెళ్లకు నువ్వుల నూనె అంటి నుదుట కుంకుమ బొట్టు పెట్టి మంగళ హారతులిచ్చి తల స్నానం చేయించి మరల మంగళహారతులు ఇవ్వాలి. ఇలా చేస్తే తోబుట్టువుల మధ్య అనుబంధం పది కాలాలపాటు పచ్చగా ఉంటుంది. ఇలా ప్రతిరోజు మంగళప్రదంగా ఉండాలని చెప్పి హారతులు అందుకొని తోబుట్టువులు బహుమతులు ఇస్తారు. ఇలాంటి సంప్రదాయాల్ని ఆచరించడంలో మన దేశం సంస్కృతికి పెద్దపీట వేసిందనే చెప్పాలి.

చాలామంది అనేక ప్రాంతాల్లో ఐదు రోజులు పూజలు చేస్తారు. ఈ ఐదు రోజుల పూజలో కుబేర లక్ష్మి పూజ చేస్తూ అన్నం ఒక కుండలాగా ఏర్పాటు చేసి దాని మీద దీపం పెట్టి లక్ష్మీదేవిని ఆహ్వానిస్తారు. నరక చతుర్దశి నాడు యమధర్మ మహారాజుకు తర్పణాలు చెయ్యాలి. అలాగే పితృతర్పణాలతో పెద్దలను తలచుకుని పూర్వీకులపై భక్తిని ప్రకటిస్తారు. భాద్రపద కృష్ణపక్షపు మహలాయ దినాలలో ఆరాధించిన పితరులకు అశ్వీయుజ అమావాస్య వీడ్కోలు తెలుపుతుందని ఋషులు పండితులు చెబుతారు. అలాగే తీపి పదార్థం, మినుములతో చేసిన ఏదైనా పదార్థాన్ని భగవంతునికి నివేదన చేసి ప్రసాదంగా స్వీకరిస్తారు. ధన త్రయోదశి రోజు సాయం సంధ్యా సమయంలో లక్ష్మీదేవిని ఉద్దేశించి దీపదారణ చెయ్యాలి. నరక చతుర్దశి నాడు యమున్ణి ఉద్దేశించి దీపదారణ చెయ్యాలి. ఈ విధంగా యమున్ణి ఉద్దేశించి దీపదారణ చేస్తే నరక ప్రాప్తి ఉండదని పెద్దలు పండితుల ఉవాచ.

ఈ పండుగను ఉత్తర భారత దేశంలో లక్ష్మీ పూజగా, బెంగాలీ వాసులు కాళీ పూజగా, తెలుగు నాట దీపావళిగా, జైనులు మహావీర నిర్వాణ లక్ష్మి, ఇంద్రభూతిజ్ఞా లక్ష్మీ పేరుతో ఈ పండుగను జరుపుకుంటారు. ఇలా ఏ రూపంలో కొలిచినా ఎవరు దీపాలు పెడతారో వారి పితృదేవతలు నరకం నుంచి విముక్తులై స్వర్గ ప్రాప్తి పొందుతారు. ఈ దీపాలని ఇంటి వాకిళ్ళలో, తులసి కోట వద్ద, గుమ్మాలలో, గోశాలలో, దేవాలయాల్లో దీప మాలికలను వెలిగిస్తారు. ఈరోజు లక్ష్మీ పూజతో పాటు వృషభాలను, గోమాతను అలంకరించి పూజిస్తారు. దీనిని గోలక్ష్మి పూజ అంటారు. ఇలా చేయడం వల్ల మనం ప్రకృతిని కూడా ఆరాధిస్తున్నట్లే. ఇలా సాయంత్రం ఇంట్లో పూజ చేసి నెయ్యి లేదా నువ్వుల నూనెతో వీలైనన్ని ఎక్కువ దీపాలు వెలిగించి "త్రయంబకం ఆవాహయామి!" లేదా "దామోదరం ఆవాహయామి!' అని నమస్కరించాలి. ఆ తర్వాత టపాసులు కాల్చి నైవేద్యంగా పెట్టిన తీపి పదార్థం తినాలి.

ఈ దీపాలని మట్టి ప్రమిదలలో వెలిగిస్తే మంచిది. మన సంప్రదాయంలో వాతావరణ మార్పులకు అనుగుణంగా మనం ఆచరించాల్సిన పద్ధతులు, తినాల్సిన ఆహారం నిర్ణయించడం ద్వారా ఆయా కాలాల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు పరిష్కరించాలన్న గొప్ప సంకల్పంతో మన పెద్దలు ఈ సాంప్రదాయాల్ని పాటించాలని చెప్పారు. శరత్, హేమంత రుతువుల్లో చలి పెరుగుతుంది కాబట్టి హృదయం ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తాయి. ఈ కాలంలో దీపాలను వెలిగిస్తే వాటి నుంచి వచ్చే కాంతి వాయువుల ద్వారా రక్తనాళాల్లో పేరుకుపోయిన కొవ్వును కరిగించి హృదయ సంబంధిత వ్యాధుల నుంచి కాపాడుతుంది. అలాగే టపాకాయల్ని కాల్చడం ద్వారా వచ్చే పొగ వాతావరణ కాలుష్య నివారణకు, వర్షాల వల్ల వచ్చే క్రిమి కీటకాలు, దోమల నివారణకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. వేదన కలిగించే స్థితికి "నరకం" అని నిర్వచనం, ఆ నరకాన్ని పోగొట్టి ఆనందాన్ని ఇచ్చి సంతోష కాంతి సాధన ఈ "దీపావళి పర్వదినం". ఇంటింటా ఆనందాల పండుగ అయిన దీపావళి అందరి జీవితాల్లో చీకట్లను పారద్రోలి వెలుగుల్ని నింపాలని కోరుకుంటూ... స్నేహితులందరికీ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు.

పింగళి భాగ్యలక్ష్మి, గుంటూరు
కాలమిస్టు రచయిత్రి (ఫ్రీ లాన్స్ జర్నలిస్టు),
9704725609

కవితలకు, సాహిత్య వ్యాసాలకు ఆహ్వానం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు అర్థవంతమైన కవితలను ప్రచురిస్తున్నాం. ప్రతి సోమవారం సాహిత్య వ్యాసలను ప్రచురించనున్నాం. తెలుగు సాహిత్యమే కాకుండా ప్రపంచ సాహిత్య పరిచయం చేసే వ్యాసాలను, విమర్శ లను పంపగలరాని కోరుతున్నాం.

మీ రచనలు prajamantalu@gmail.comకు పంపండి. -ఎడిటర్.



# దీపం లక్ష్మీ నమోస్తు తే

సనాతన హైందవ సంప్రదాయంలో జరుపుకునే పండుగలను మూడు రకాలుగా చెప్పుకోవచ్చు. అవి వైయక్తికము, పారివారికము, సామాజికము. కొన్ని పండుగలు అన్ని తరహాలకు చెందినవిగా ఉంటాయి. వాటిలో 'దీపావళి' పండుగ మిక్కిలి ప్రశస్తమైనది. వెలుగులను విరజిమ్ముతూ, చీకట్లను పారద్రోలుతూ జనావళి హృదయాలలో ఆనందోత్సాహాలతో పాటు ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మికతను, అభ్యుదయాన్ని ఇచ్చే విధంగా దీపావళి పర్వదినాన్ని తరతరాలుగా యావత్ భారతీయులే కాకుండా నేపాల్, మారిష్యస్, శ్రీలంక, గయానా, ఫిజి, ఇండోనేషియా, మలేషియా, బర్మా, టిబెట్ మొదలైన దేశ ప్రజలందరూ మరియు అమెరికా వంటి విదేశాల్లో నివసిస్తున్నటువంటి హైందవులందరూ జరుపుకుంటున్నారు.

ఈ పండుగ ఆశ్వయుజ బహుళ చతుర్దశి నాడు వస్తుంది. దీపావళి అంటే దీపముల వరుస. ఈ పండుగ నాడు పడుతులు ప్రమిదలతో చమురు (నూనె)ను పోసి, వత్తి వేసి ఇంటి ముంగిళ్ళలోనూ, అరుగుల పైన, మేడల పైన, ఇంటి ప్రహరీ గోడల పైన వరుసగా బారులు తీర్చి దీపాలు వెలిగిస్తారు. ఈ చతుర్దశిని 'నరక చతుర్దశి' అని కూడా అంటారు.

నిత్య చైతన్యశక్తి సత్యాదేవి

సత్యా కృష్ణులు నరకాసురునితో యుద్ధం చేసి ఈ రోజున అతన్ని సంహరించారు. కనుక ఇది నరక చతుర్దశి అయ్యిందని భాగవతంలోనూ, హరివంశంలోనూ హృద్యమైన పద్యాలలో వర్ణించబడింది. లోక కంఠకుడైన కారణంగా తమ బిడ్డ అయినప్పటికినీ నరకాసురుని హతమార్చారు సత్యా కృష్ణులు. లోక సంక్షేమం కోసం తాను పుత్రశోకాన్ని సైతం అనుభవించిందా కన్నతల్లి. గర్భ శోకాన్ని తన వరకే పరిమితం చేసుకొని దుర్మార్గుడైన తన పుత్రుని వలన కలిగిన అత్యాచార అన్యాయ చీకట్లను తొలగించిన అమృతమూర్తి, నిత్య చైతన్య శక్తి ఆ సత్యాదేవి.

దీపం లక్ష్మీ నమోస్తు తే

వేదం దీపాన్ని 'పరబ్రహ్మ స్వరూపం' గా తెలియజేసింది. 'అగ్ని



ప్రథమః' అని ఋగ్వేదం పేర్కొంది. అందుచేతనే ప్రతి పూజలోనూ ముందుగా దీపాన్ని వెలిగిస్తారు. ఋగ్వేదంలోని ప్రథమ సూక్తం "దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వతమోహతే దీపేన సాధ్యతే సర్వం దీపం లక్ష్మి నమోస్తుతే" అని నమస్కరిస్తారు. ఇలా ప్రతి నిత్యం దీపారాధనం చేయడం వల్ల క్రమంగా వ్యక్తిలో దైవీభావన పెంపొందుతుంది. దాని వలన వినయం వివేకం ఏర్పడతాయి. ఇలా వినయవంతుడు తన చుట్టూ ఉన్న ప్రపంచానికి ఎలాంటి చెడు చేయకుండా జీవిస్తాడు. అది లేనివాడు అనగా తెలియనివాడు నరకాసురుడిలా ఈ ప్రపంచమంతా తన కోసమే ఉందని



భ్రమపడి, తన స్వార్ధ ప్రయోజనాల కోసమే అన్నింటిని, అందరినీ ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. అందుకు తన వారిని సైతం బాధిస్తాడు. ఇలా ఇతరులను బాధించడం దానవ లక్షణం. (ఈ లక్షణాలు ఈ మధ్యన ఆధునికులలో బాగా కనిపిస్తుంది.) నరక చతుర్దశి అనే పేరులో ఉన్న 'నరక' అన్న మాటకు అర్థం నరకాసురుడు గాక నరకం అంటే స్వర్గం కానిది అని అర్థాన్ని గ్రహించాల్సి ఉంది.

"నర కాయ ప్రదాతవ్యంబీ
దీప సంపూర్య దేవతా?
చతుర్దశ్యాంతు యే దీపోబీ
నరకాయ ప్రదీయతే?
తేషాం పితృగణాం సర్వేబీ
నరకాత్ స్వర్గ మవాప్నయు? అనగా నరకం కలుగకుండా దీపం వెలిగించాలి. చతుర్దశి నాడు ఎవరైతే ఈ దీపం వెలిగిస్తారో వారికి, వారి పితృదేవతలకు నరకం తొలగి స్వర్గం ప్రాప్తిస్తుందని ఈ శ్లోకం తెలియజేస్తుంది.

దీపావళి రోజున ఇలా చేయాలి

దీపావళి నాడు తైలాభ్యంగనానికి విశేషమైన మహత్తు ఉంది. ఈ రోజున నువ్వుల నూనెలో లక్ష్మీదేవి ఉంటుందని, నదులు బావులు చెరువులలోని నీటిలో గంగాదేవి ఉంటుందని హైందవులు నమ్ముతారు. ఈ విషయాన్ని ఈ శ్లోకం వివరిస్తుందిలా..

తైలే లక్ష్మీ ర్జలే గంగాబీ
దీపావళీ తిథౌ వసేత్?
అలక్ష్మీ పరిహారార్థంబీ
తైలాభ్యంగో విధీయతే? ఈరోజు తలంటుకొని స్నానం చేయడం వల్ల అంతవరకు ఉన్న దారిద్ర్యం అంతా తొలగిపోతుంది. గంగా స్నానఫలం కూడా దక్కుతుంది. నరకప్రాప్తి భయం తొలుగుతుంది. అయితే సూర్యోదయానికి ముందు నాలుగు ఘడియల కాలం అరుణోదయ సమయం. ఆలోగా తలంటు స్నానం చేయడం శ్రేష్టం. ఒకవేళ వీలు కాకపోతే సూర్యోదయం తర్వాత నైనా తప్పనిసరిగా తల స్నానం చేయాలి.

ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ఇచ్చే దీపావళి

ఈ పండుగ వెనుక మరో ప్రయోజనం కూడా దాగి ఉంది. ఇది శరదృతువులో వస్తుంది. కనుక ఈ ఋతువు ప్రభావంతో ప్రకృతిలో ఏర్పడిన కల్మషాలను సరిదిద్ది సకల ప్రాణుల ఆరోగ్యాలకు ఎటువంటి భంగం కలగకుండా చేసుకోవడానికి మన పూర్వీకులు మనకు ఒక అద్భుతమైన ఆరోగ్యకరమైన మార్గాన్ని నిర్దేశించారు. దీనికే 'ఋతు చర్య' అని పేరు ఇందులో భాగమే 'వాయుశోధనము' శరదృతువులో వర్షఋతువు ప్రభావం వల్ల అనారోగ్యకారక క్రిములు ఎన్నో వాతావరణంలో పుడతాయి. రోగాలను వ్యాపింపజేసే క్రిములను నాశనం చేయాల్సి ఉంటుంది. ఈ రోగకారక క్రిములలో కొన్ని కాంతికి, కొన్ని వాసనకు, మరికొన్ని శబ్దానికి అంతరించడమో లేదా పారిపోవడమో జరుగుతుంది. అందువల్లనే దీపావళి రోజున మతాబుల వంటి కాంతిని ఇచ్చేవి వాటిలో వాడిన గంధకం వంటి రసాయనిక పదార్థాల వలన వచ్చే వాసన టపాసుల వల్ల వచ్చే శబ్దం వాటి వల్ల వాయుశోధన జరుగుతుంది. అనగా వాతావరణంలో మనకు హాని కలిగించే క్రిమి కీటకాలన్నీ నశిస్తాయి. ఈ దీపావళి నవ్వుల పువ్వులు తారా జువ్వలై విరజిమ్మే ఆనంద సంబరం అనవచ్చు. ఈ దీపావళి మనందరిలోని జ్ఞానపు చీకట్లను పారద్రోల్చిన కాంతులను ప్రసాదించి, మనందరినీ జ్యోతిర్పథం దిశగా నడిపిస్తుందని ఆశిద్దాం! ఆకాంక్షిద్దాం!

చౌదూరి నరసింహారావు
"సాహిత్య కళా విభూషణ, నంది పురస్కార గ్రహీత
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

# పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి: చైర్ పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల అక్టోబర్ 30(ప్రజా మంటలు) : జగిత్యాల పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి తో ముందుకు వెళ్తామని ప్రజలు అందరూ సహకరించాలని కొరినారు. పురపాలక సంఘ అధ్యక్షురాలు అడువాల జ్యోతి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో మాట్లాడుతూ, జగిత్యాల పట్టణములో పారిశుధ్యము మెరుగు పరుచుటలో పలు వార్డులలో పాత ఆటోలు తరచూ రిపేర్ కావడం వలన ఇంటి ఇంటి చెత్త సేకరణకు ఇబ్బందులు ఏర్పడినవి. అట్టి పాత ఆటోల స్థానములో 16 కొత్త ఆటోలు కొనుగోలు చేసి పట్టణ పారిశుధ్యమునకు ఇబ్బంది కలగకుండా వినియోగములోకి తీసుకురావడం దృష్ట్యా చైర్ పర్సన్, కమిషనర్, డి.ఈ. మరియు ఎ.ఈ గార్లకు వార్డు కౌన్సిలర్లు శాలువాతో సత్కరించి వార్డులలో కొత్త వాహనములు కేటాయించి వార్డు ఇంటి ఇంటి చెత్త సేకరణ సమస్యను తీర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీట్ బజార్ యందు నూతనముగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను వినియోగములోకి తీసుకురావడంలోకి 25.00 లక్షలు కేటాయింపు తో పాటు, 9 అజెండా అంశములు ప్రవేశ పెట్టగా, కౌన్సిల్ ఆమోదము తెలిపినది. పలువురు సభ్యులు పలు సమస్యలను అధ్యక్షురాలి దృష్టికి తీసుకరాగా అట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబందిత అధికారులను ఆదేశించడము జరిగినది. సమావేశములో కౌన్సిల్ సభ్యులు మునిసిపల్ కమీషనర్ బి. చిరంజీవి, యం. అర్.ఓ రాం మోహన్, డి.ఈ యాదగిరి, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీయర్లు శరణ్ తేజ, అనిల్, టి.పి.ఓ. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# కొడిమ్యాల హనుమాన్ దేవాలయంలో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

## పాల్గొన్న చొప్పదండి తాజా మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్..

కొడిమ్యాల నవంబర్ 30 (ప్రజా మంటలు) : కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రసిద్ధ హనుమాన్ దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వాహకులు ఏర్పాటు చేయగా చొప్పదండి తాజా మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ హాజరైనారు. భక్తులతో కలిసి అన్న ప్రసాదాలు స్వీకరించి, నిర్వాహకులను అభినందించారు. వారి వెంట బారాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కొత్తూరి స్వామి, నాయకులు కాయిత రాజు, మహమ్మద్ అజ్జు, ఎండి సల్మాన్, రాచకొండ చంద్రమోహన్,రాము, సోమ సాగర్, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

## వార్షిక తనిఖీల్లో భాగంగా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ

## గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

## ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్

గొల్లపల్లి అక్టోబర్ 30 (ప్రజా మంటలు) : గొల్లపల్లి మండల ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. వార్షిక తనిఖీ లో భాగంగా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని,బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చని అన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టాయని అసాంఘిక కార్యకలాపాలు ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీస్ స్టేషన్ లో పెట్రోల్ కార్ మరియు బ్లూ కోట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు దూరంగా ఉన్నప్పటికీ 10 నిమిషాల్లో చేరుకునే విధంగా పని చేస్తున్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసుల గురించి, మరియు పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేశారు పోలీస్ స్టేషన్ ల పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో 5%ఎా% అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు

ఈ సందర్భంగా రిసెప్షన్ వర్టికల్ నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు ను పిటిషన్ మేనేజ్మెంట్లో ఎంట్రీ చేసిన డాటా ను తనిఖీ చేశారు. రిసెప్షన్ఈస్ట్ గా ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో జనరేట్ చేసినా రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5%ఎా% విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.రికార్డ్ రూమ్ రైటర్ రూమ్ తదితర అన్నివిభాగాలు క్షుణ్ణంగా పరిశీలించారు అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన



ఉండాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే నాదృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, ధర్మపురి సిఐ రామ్ నరసింహ రెడ్డి, క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సతీష్ , శ్రీధర్ రెడ్డి, ఉమసాగర్ ,మహేశ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా బాధ్యతలు స్వీకరించిన బి. ఎస్. లత

జగిత్యాల అక్టోబర్ 30 (ప్రజా మంటలు) : జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా బి. ఎస్. లత బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో పి. రాంబాబు ను బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో బి. ఎస్. లతను ప్రభుత్వం నియమించింది. బుధవారం రోజున ఐ డి ఓ సి లో బదిలీ పై వెళ్తున్న పి. రాంబాబు నుండి బాధ్యతలను స్వీకరించారు.



# కుటుంబ సర్వే పై ఎన్యుమరేటర్లకు శిక్షణ

జగిత్యాల అక్టోబర్ 30 (ప్రజా మంటలు) :



మెప్మా హాల్ యందు తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పై గౌరవ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మునిసిపల్ కమీషనర్, తహశీల్దార్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, సి. డి, పి.ఓ మరియు మెప్మా ఏ.ఓ.ల ఆద్వర్యములో ఎన్యుమరేటర్లకు శిక్షణా కార్యక్రమము ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమములో ఎన్యుమరేటర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సర్వే నిర్వహించుచూ, ఎన్యుమరేషన్ వారికి కేటాయించిన బ్లాకులలోని ప్రతి కుటుంభానికి సంబంధించి షెడ్యూల్ పార్ట్ 1 ,2 75 ప్రశ్నలతో కూడిన కుటుంబ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలి, ప్రతి ఇంటిలోని వారితో గౌరవంగా, హుందాగా వ్యవహరించి, ప్రతి కుటుంబము నుండి స్పష్టత కల్గిన మరియు నిజాయితీతో కూడిన సమాధానాలను సేకరించాలి. ఈ సర్వే యొక్క ప్రధాన ఉద్దేశం పై ప్రజలకి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. హౌస్ లిస్టింగ్ అయిన వెంటనే వివరాలు నింపిన స్టిక్కర్ ని ఇంటి గోడపై అతికించాలి. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబ యజమానికి వారి వద్ద నుండి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని వారికి తెలియచేస్తూ, ప్రభుత్వము సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్ణీత సమయము లోగా పూర్తిచేయుటకు దిశా నిర్దేశం చేశారు. శిక్షణ కార్యక్రమమునకు వార్డు ఆఫీసర్లు, ఆర్.పి.లు, అంగన్ వాడి టీచర్లు, ఆశావర్కర్లు పాల్గోన్నారు.

# 250 పడకల ఆసుపత్రి గా మార్చడం చాలా సంతోషం

## విద్య వైద్యము అందించడమే కాంగ్రెస్ పార్టీ యొక్క లక్ష్యం -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి

ఎల్కతుర్తి: అక్టోబర్ 30 (ప్రజా మంటలు) : ఎల్కతుర్తి మండల కేంద్రంలో, ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బహుజన ఉద్యమ నాయకులు హుస్నాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మత్యులు పొన్నం ప్రభాకర్ అన్న గారి చిత్రపటానికి పాలాభిషేకం, మంత్రి పొన్నం ప్రభాకర్ అన్న గారి చొరువ తో హుస్నాబాద్ లోని వంద పడకల ఆసుపత్రిని 250 పడకల మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు, ఎల్కతుర్తి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ శాసన సభ్యులు, రాష్ట్ర రవాణా మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ చొరవతో హుస్నాబాద్ లోని 100 పడుకల ఆసుపత్రిని 250 పడకల ఆసుపత్రిగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చాలా హర్షించదగ్గ విషయమని హుస్నాబాద్ ఆసుపత్రి 100 పడకల నుండి 250 పడకల ఆసుపత్రి గా మార్చడానికి 82.00 కోట్ల రూపాయలను విడుదల చేసి దీపావళి కానుకగా ఇచ్చారు. హుస్నాబాద్ ప్రజలకు వైద్య సేవలకు దూర ప్రాంతాలకు ప్రైవేట్ కార్పొరేట్ హాస్పటల్ దీటుగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో ప్రవేట్ కార్పొరేట్ హాస్పిటలకు వెళ్లకుండా హుస్నాబాద్ పట్టణంలోని అన్ని సౌకర్యాలతో మరో 150 పడకలను పెంచడం ఈ మేరకు రాష్ట్ర హెల్త్, మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నిధులు విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు జారీ చేయడం చాలా సంతోషకరమైన విషయం అని పొన్నం ప్రభాకర్ గౌడ్ హుస్నాబాద్ శాసన సభ్యులుగా ఎన్నిక అయ్యాక వేగంగా అభివృద్ధి చెందుతున్న హుస్నాబాద్ అని అన్నారు

హుస్నాబాద్ ఆసుపత్రి ని 250 పడకల ఆసుపత్రి గా మార్చడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి



దామోదర రాజనర్సింహకి అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతున్నటువంటి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు, ఈ కార్యక్రమం లో. ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు సుకిన సంతాజి, మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్, శనిగరపు స్వరూప వెంకటేష్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి,బావుపేట్ గ్రామ శాఖ అధ్యక్షులు బత్తిని రవీందర్, పెంచికల్పేట గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీనివాస్, ఇందిరానగర్ గ్రామ శాఖ అధ్యక్షులు అంబాల రమేష్, సీనియర్ నాయకులు, అక్తర్,డా.రమేష్,వైసిసి మాజీ మండల యూత్ అధ్యక్షులు ఆంబాల స్వామి, సారయ్య, కామృద్ధిన్,డా ప్రభాకర్,ప్రకాష్, జగన్,యూత్ కాంగ్రెస్ నాయకులు గొడిశాల వినయ్,వెంకట్,సాహు తదితరులు పాల్గొన్నారు.

# జీడి మల్లేష్ ను అభినందించిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ కుమార్

జమ్మికుంట అక్తపబర్ 30 (ప్రజా మంటలు) :



జమ్మికుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు జీడి మల్లేష్ కరీంనగర్ జిల్లాలో అత్యధిక బిజెపి సభ్యత్వాలు చేపించడం పట్ల బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గార్లు ఈరోజు కరీంనగర్ జరిగిన బిజెపి సమావేశంలో జీడి మల్లెష్ ను శాలువా కప్పి అభినందించారు. జమ్మికుంట పట్టణంలోని 39 బూత్ లల్లో సుమారు 11 వేల సభ్యత్వాలు చేపించినట్టు జీడి మలేష్ తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున సభ్యత్వం కావడానికి నాతోపాటు బీజేపీ పట్టణ కమిటీ,బూత్ అధ్యక్షుల సమిష్టి కృషి అని తెలిపారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసం కారణంగానే ప్రజలు పెద్దయెత్తున, స్వచ్ఛందంగా సభ్యత్వాలు తీసుకున్నారని మల్లేష్ అన్నారు.

# తనుగుల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

జమ్మికుంట అక్టోబర్ 30 (ప్రజా మంటలు) :




జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తనుగుల గ్రామములో డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 48 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయడం జరిగినది. ఇద్దరు జ్వర పీడితులను గుర్తించి, వారి రక్త పూతల నామునాలను సేకరించి, వ్యాధి నిర్ధారణ పరీక్షల నిమిత్తం ల్యాబ్ కి పంపించనైనది. గ్రామమస్తులకి మలేరియా, డెంగీ మరియు చికెన్ గున్యా మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం, వ్యాధుల లక్షణాలు మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించి చెప్పినారు. అసంక్ర మిత వ్యాధులు మధుమేహం, రక్తపోటు వ్యాధుల గురించి అవగహన కల్పించి, అవసరం ఉన్న వారికి మందులు ఇవ్వడం జరిగినది. అంతేగాకుండా వారికి ఆహార అలవాట్ల గురించి అవగాహన కల్పించనైనది. వ్యక్తి గత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించిన్నారు. ప్రతి మంగళవారం మరియు శు క్రవారం తప్పనిసరిగా డ్రై డే కార్యక్రమము చేపట్టి దోమల లార్వా లను నిర్మూలించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమములో డాక్టర్ కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్స్ సదానందం, కుసుమకుమారి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, %ూచీవీ% మణెమ్మ, సంపూర్ణ, పుష్పలత ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.


# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి
## కలెక్టర్ బి.సత్య ప్రసాద్





మల్లాపూర్ /జగిత్యాల అక్టోబర్ 30 (ప్రజా మంటలు) : జిల్లాలో నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను అధికారులందరూ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. మల్లాపూర్ మండలం ప్రజా పరిషత్ కార్యాలయం లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పై అంగన్వాడీ, ఆశ వర్కర్, పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ యజమాని ఇంట్లో వారి వివరాలు పక్కాగా నమోదు చేయాలని, గ్రామాల్లో అధికారులు ఇచ్చిన మ్యాప్ ఆధారితంగా నాలుగు జోన్లుగా విభజించి, అధికారులు సమన్వయంతో సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి ఒక్క ఆఫీసర్ 150 నుండి 200 వరకు ప్రతిరోజు ఇంటింటికి తిరుగుతూ వివరాలను సేకరించాలని సర్వే అయిన ప్రతి ఇంటికి ఖచ్చితంగా స్టిక్కర్ అతికించాలని తెలిపారు. నవంబర్ 1 తేదీ ఉదయం నుండి ప్రతి ఒక్కరు గ్రౌండ్ లెవెల్లో సర్వేని ప్రారంభించాలని ఆదేశించారు. సమగ్ర కుటుంబ దరఖాస్తు పత్రంలో 56 ప్రశ్నలతో కూడిన పత్రం ఉంటుందని, కావున దీనికి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇచ్చిన బుక్లెట్ ఆధారంగా కోడ్ పద్ధతిలో కుటుంబ నిర్ధారణ వివరాలు నమోదు చేయాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. సీరియల్ నెంబర్ ఆధారితంగా గ్రామంలోని వార్డును, ఏరియాను ఎంపిక చేసుకొని నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సర్వే చేస్తున్న సమయంలో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు ధరణి పాస్ పుస్తకాలు కుటుంబం దగ్గర ఉంచుకునేలా ప్రచారం చేయాలని అన్నారు. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబం యజమానికి వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలియజేయాలని, నింపిన షెడ్యూల్ ఫారంలోని జాగ్రత్తగా భద్రపరచాలని, ఈ డేటా ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని తెలిపారు. రోజువారి సర్వే నివేదికను జిల్లా వారీగా ఏరోజుకారోజు సాయంత్రం 6 గంటలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్, తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







## భోలక్ పూర్ లో చిన్నారుల దీపావళి సెలబ్రేషన్స్

సికింద్రాబాద్ అక్టోబర్ 30 (ప్రజామంటలు) : సికింద్రాబాద్ భోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో బుధవారం దీపావళి పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్.కే.జీ, యూకేజీ, చిన్నారి విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, స్కూల్ లో పెట్టిన బొమ్మల కొలువు వద్ద పూజల్లో పాల్గొన్నారు. అనంతరం టపాసులు, తారాజువ్వలు కాల్చి, దీపావళి పండుగ సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. ఈసందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు మాట్లాడుతూ..ఏడాది పొడుగున వచ్చే ప్రతి పండుగను స్కూల్ లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పండుగ సెలబ్రేషన్స్ లో పండుగ విశిష్టత గురించి చిన్నారులకు వివరిస్తామన్నారు. చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయలను నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిమ్మ చీకట్లు చీల్చి చిరుదివ్వెల వెలుగులు విరజిమ్మే వేడుక..
## నేడే దీపావళి పండుగ



రాయికల్ అక్టోబర్ 31 (ప్రజా మంటలు) : అజ్ఞానమనే చిమ్మ చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగులను విరజిమ్మే పండుగ దీపావళి వేడుకని, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రజలు ఆనందంతో జరుపుకునేదే దీపావళి పండుగ అని తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ తెలిపారు. దీపం ఉన్న చోట జ్ఞానసంపద ఉంటుందని దీపం లక్ష్మీదేవి దేవీ స్వరూపమని శాస్త్రాలు చెపుతున్నాయి.ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి.. నూతన వెలుగులు తీసుకొచ్చే గొప్ప పండుగ దీపావళి అని చెరుకు మహేశ్వర శర్మ అన్నారు.

హిందువులతో పాటు జైనులు, బౌద్ధులు, సిక్కులు, తదితర మతస్తులు ఆరోగ్యం, ఐశ్వర్యం సుఖము సంతోషం సౌభాగ్యాన్ని కోరుకుంటూ చేసుకునే పర్వదినమే దీపావళి అని తెలిపారు. ప్రతియేటా ఆశ్వయుజ బహుళ అమావాస్య రోజు ఈ పండుగను జరుపుకుంటారని, ఈ ఏడాది అక్టోబర్ 31 నవంబర్ 1 గురు, శుక్ర వారాల్లో దీపావళి పండుగ ఉందని , ఈ సందర్భంగా దీపావళి విశిష్టతను చెరుకు మహేశ్వర శర్మ వివరించారు.

పురాణ కథనం ప్రకారం.. భూదేవి, వరహా స్వామికి అసుర సమయంలో జన్మించిన నరకాసురుడు.. శ్రీహరి చేతిలో చావులేని విధంగా తల్లి చేతిలోనే మరణించేలా వరం పొందుతాడు. వరగర్వంతో లోకకంటకుడిగా తయారైన నరకుడు ముల్లోకాలను పట్టిపీడించాడు. నరకాసురుడి బాధలు భరించలేని దేవతలు, మునులు, గంధర్వులు శ్రీహరికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి మొర ఆలకించిన శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో కృష్ణుడిగా అవతరించి సత్యభామతో నరకాసురుని సంహరింపజేశాడు. నరకాసుర సంహారంతో అందరూ అనందంగా పండుగ చేసుకున్నారు. చతుర్దశి నాడు నరకుడి మరణించగా, ఆ తర్వాత రోజు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. దీపావళి అంటే దీపాల వరుస అన్ని అర్థం. కొన్ని ప్రాంతాల్లో దీపావళిని ఐదు రోజుల పండుగగా జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ప్రారంభమైన దీపావళి వేడుకలు.. కార్తీక శుద్ధ విదియ 'భగినీహస్త భోజనం"తో ముగుస్తుంది.

ఆశ్వయుజ బహుళ త్రయోదశినే ధన త్రయోదశిగా జరుపుకుంటారు. ఇంటిని శుభ్రం చేసి, పాత సామాన్లను శుభ్రం చేస్తారు. కొత్తగా కొనుగోలు చేసిన వెండి, బంగారు ఆభరణాలు ఈ రోజున పూజలో పెడితే ధనలక్ష్మి అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుందని విశ్వసిస్తారు. అందుకే ధనలక్ష్మీ, కుబేరులను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. బంగారం, వెండి కాకుండా ధన త్రయోదశి రోజు ఏ వస్తువు కొనుగోలు చేసి శుభం జరుగుతుందంటారు. అమృతం కోసం దేవతలు క్షీరసాగరాన్ని మధించినప్పుడు ధన త్రయోదశి రోజునే లక్ష్మి దేవి ఉద్భవించినట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకే ఈ రోజున తనను పూజించిన వారికి లక్ష్మీదేవి అనుగ్రహిస్తుంది. ఏ వస్తువు ఇంటికి తెచ్చినా లాభదాయకం అవుతుందని చాలా మంది నమ్ముతారు.ఆశ్వయుజ అమావాస్య రోజునే దీపావళి పండగ. ఈ సమయంలో ఇంటిని శుభ్రం చేసి, రకరకాల పిండి వంటలు తయారు చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో సంధ్యా సమయంలో ఎండిన ఈత కమ్మలు గోగు కర్రలకు గుడ్డ పీలికలతో కాగడాలు కట్టి, వెలిగించి, గుమ్మాల్లో నేల మీద కొడుతూ... 'దిబ్బి దిబ్బి దీపావళి, మళ్ళీ వచ్చే నాగులచవితి, పుట్ట మీద జొన్నకర్ర, పుటుక్కు దెబ్బ! అని పాడతారు.

గోగు కర్రల్ని ఎవరూ తొక్కని చోటవేసి, వెనక్కి తిరిగి చూడకుండా కాళ్లు కడుక్కుని లోపలికి వెళ్లి శుభానికి మిఠాయి తింటారు. ఇలా చేస్తే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని విశ్వసిస్తారు. తర్వాత ఇంటిని దీపాలతో అలంకరిస్తారు. మట్టి ప్రమిదలు, నువ్వుల నూనె వాడటం మంచిది. లక్ష్మీదేవికి ఇష్టమైన నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తే అమ్మ అనుగ్రహం లభిస్తుంది. గుమ్మం, తులసి దగ్గర మాత్రం తప్పనిసరిగా మట్టి ప్రమిదలో నువ్వుల నూనె లేదా ఆవు నేతితో దీపాలు వెలిగించాలి. ప్రదోష సమయంలోనే లక్ష్మి దేవి పూజ చేస్తారు. ధనలక్ష్మి పూజ ఈ రోజు చేస్తే ధన ధాన్యాలు, అష్టైశ్వర్యాలు సంప్రాప్తిస్తాయి. దీపావళి రోజున లక్ష్మీపూజతో తమ వ్యాపారం వృద్ధి చెందుతుందని వ్యాపారులు నమ్ముతారు. కొత్త బంగారు, వెండి ఆభరణాలు పూజలో పెడితే శుభప్రదమని భావిస్తారు. ఖాతా పుస్తకాలు తెరుస్తారు.నూతన వ్యాపార వాణిజ్యాలు ప్రారంభిస్తారు . దీపావళి నోములు కేదారేశ్వర స్వామి వ్రతములు చేసుకుంటారని చెరుకు మహేశ్వర శర్మ వివరించారు.

# బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ గా "అల్ఫోర్స్" డా.నరేందర్ రెడ్డి..




కరీంనగర్ అక్టోబర్ 30 (ప్రజా మంటలు) : కరీంనగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ గా అల్ఫోర్స్ అధినేత, రాబోయే పట్టబదరుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న యదా. నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగర కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు అందరు వారిని ఘనంగా సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి క్రీడారంగానికి వన్నె తేవాలని ఆకాంక్షించారు.ప్రతిష్టాత్మక క్రీడా సంస్థకు చైర్మన్ గా ఎన్నిక చేసినందుకు క్రీడాకారులు అందరికీ నరేందర్ రెడ్డి గారు అభినందనలు తెలిపి క్రీడా రంగానికి చేయూతనిచ్చి క్రీడాకారులకు అన్ని రకాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

## మారు గంగారెడ్డికి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల, మాజీ జెడ్పి చైర్ పర్సన్ వసంత నివాళులు



జగిత్యాల రూరల్ అక్టోబర్ 30 (ప్రజా మంటలు) : మండలములో ఇటీవల హత్యకు గురయిన జాబితపూర్ గ్రామం మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ పరామర్శించారు. వెంట మాజీ ఎంపీటీసీ చిత్తారి స్వప్నశ్రీనివాస్,మాజీ ఏ ఎం సి చైర్మన్ శీలం ప్రియాంకప్రవీణ్,రూరల్ మండల సమన్వయ కమిటీ నాయకులు పడిగేల గంగారెడ్డి, ఆసిఫ్, అర్బన్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, రాయికల్ మండల మహిళ అధ్యక్షురాలు స్పందన, నాయకులు స్వామి రెడ్డి,షఫీ తదితరులున్నారు.

## గాంధీ లో ట్రీట్మెంట్ పొందుతూ మృతి చెందిన అనామకుడు




సికింద్రాబాద్, అక్టోబర్ 30 (ప్రజామంటలు) : సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ట్రీట్మెంట్ పొందుతూ చనిపోయాడు. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....గాంధీ ఆసుపత్రి ఆవరణలో అచేతన స్థితిలో కింద పడి ఉన్న దాదాపు 65 ఏండ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తిని చూసిన సెక్యూరిటీ సూపర్ వైజర్ సుబ్బారావు వెంటనే ఆసుపత్రి లో అడ్మిట్ చేయించి, చికిత్స చేయించాడు. అయితే సదరు గుర్తు తెలియని వ్యక్తి ట్రీట్మెంట్ పొందుతూ చనిపోయాడు. ఎలాంటి వివరాలు లేకపోవడంతో డెడ్ బాడీని గాంధీ మార్చురీకి తరలించి, భద్రపరిచారు. పొటోలోని వ్యక్తిని గుర్తు పట్టిన వారు చిలకలగూడ పీఎస్ లో తెలపాలని పోలీసులు కోరారు.


# ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి
## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కునమనేనికి నరేందర్ రెడ్డి వినతి




కరీంనగర్ అక్టోబర్ 30 (ప్రజా మంటలు) రానున్న పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి.. బుధవారం సిపిఐ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే శ్రీ కూనమనేని సాంబశివరావును కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు.

## నేడు స్కందగిరికి రానున్న శ్రీరామ యంత్ర రథయాత్ర





సికింద్రాబాద్, అక్టోబర్ 30 ( ప్రజామంటలు ) : తిరుపతిలో ఈనెల 27న కంచి పీఠాధిపతి ప్రారంభించిన శ్రీరామ యంత్ర రథయాత్ర ఈనెల 31న సాయంత్రం సికింద్రాబాద్ స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ సన్నిధానానికి చేరుకోనుంది. ఐదు రాష్ట్రాల గుండా వెళ్ళే ఈ రథయాత్ర నవంబర్ 16న అయోధ్య క్షేత్రానికి చేరుకుంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భాన్ని పురస్కరించుకొని నవంబర్ ఒకటిన ఆలయంలో ప్రత్యేక పూజలు, సద్గురు శ్రీ త్యాగరాజ కీర్తనలు, విష్ణుసహస్ర పారాయణం, వేదపఠనం, శ్రీరామదాసు కీర్తనలు, తిరుప్పావై, నామాసంకీర్తనలు, ఆలయ ఆవరణలో రథయాత్ర ఊరేగింపు ఉంటుందన్నారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామి వారి కరుణ కటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

# భార్యను చంపిన భర్త





మల్లాపూర్ అక్టోబర్ 30 (ప్రజా మంటలు) మల్లాపూర్ మండల్ వేంపల్లి గ్రామంలో కట్టుకున్న భర్తే కాలయముడు అయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెల్మల రమేష్ వెల్మల సునీత భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు కొడుకు, కూతురు బుధవారం ఉదయం పూట ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆ గొడవలో రమేష్ భార్య సునితను నెట్టివేయడంతో తలకు తీవ్రంగా గాయాలయి అక్కడికక్కడే మృతి చెందిందని వీళ్లిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని స్థానికులు తెలిపారు.

# చంద్రబాబు, కరువు కవల పిల్లలు

## నైరుతి పవనాలు అనుకూలించినా రాయలసీమలో కరువు ఛాయలు

## ఐదు జిల్లాలు, 54 మండలాల్లో కోరలు చాస్తున్న కరువు

## చంద్రబాబుపై ఎంపీ విజయసాయిరెడ్డి ఎద్దేవా

అమరావతి, (ప్రజా మంటలు):



చంద్రబాబు, కరువు కవల పిల్లలు అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చంద్రబాబును ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిన నేపథ్యంలో చంద్రబాబుపై తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబు వస్తే కరువు వస్తుందని అన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలు అనేది నానుడి అని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది నైరుతి అనుకూలించినా రాయలసీమలో కరువు నీడలు వెంటాడుతున్నాయని విజయసాయిరెడ్డితెలిపారు. ఐదు జిల్లాలలో 54 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి ఉందని అన్నారు. వైసీపీ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లపాటు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని పక్కన పెట్టి రైతుల ఉసురు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ 2024కి సంబంధించి ఏపీ ప్రభుత్వం కరువు మండలాల జాబితాను మంగళవారం ప్రకటించింది. ఐదు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 54 మండలాలు కరువు ప్రభావితానికి గురయ్యాయని తెలిపింది. ఈ మేరకు ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఉన్న ఈ 54 మండలాల్లో వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదు కావడంతో ఈ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ ప్రభుత్వం ఆ జీవోలో తెలిపింది. వీటిలోని 27 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్షం ఉంటే.. మరో 27 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. కలెక్టర్లు ఆయా జిల్లా గెజిట్‌లలో కరువు మండలాలను నోటిఫై చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

# కలకలం రేపుతున్న బాంబుల బెదిరింపు

## నగరంలోని హోటళ్లకు మరోసారి బెదిరింపు కాల్స్

## డాగ్, బాంబు స్క్వాడ్లతో తనిఖీలు

తిరుపతి, అక్టోబర్ 30 (ప్రజా మంటలు):

ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో వరుస బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. స్థానికులతోపాటు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఆందోళనకు గుర్తిచేస్తున్నాయి. నగరంలోని హోటళ్లకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. గ్యాస్, వాటర్ పైపులైన్లు, మురుగునీటి పైపుల్లో పేలుడు పదార్థాలు ఉంచామంటూ ఎనిమిది హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు తాజ్, బ్లిస్, మినర్వా, చక్రి, పాయ్ వైస్రాయ్, రీనెస్ట్, గోల్డెన్ దులీప్ హోటళ్లలో పోలీసులు.. డాగ్, బాంబు స్క్వాడ్లతో తనిఖీలు చేశారు. అయితే ఎక్కడా పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఐఎస్ఐ పేరుతో మంగళవారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభమైన ఈ మెయిల్స్.. అర్ధరాత్రి వరకు కొనసాగాయి. కాగా, తమిళనాడులో ఐఎస్ఐ ఉగ్రవాది జాఫర్ సాదిక్?కు జైలు శిక్ష పడటంతో ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట ఈ బెదిరింపులు



వస్తున్నాయి. తమిళనాడుతో పాటు తిరుపతిలోని హోటళ్లకు బాంబు మెయిల్స్ రావటం సమస్యగా మారింది. కంగారు పడాల్సిన అవసరం లేదని బెదిరింపు మెయిల్స్ ఎక్కడి నుంచి పంపుతున్నారనే విషయమై దర్యాప్త జరుగుతోందని మొత్తం ఆరు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# అసలు బాధితుడు జగనే

## విజయమ్మ బహిరంగ లేఖపై వైసీపీ అసహనం

## ఆనాడు జగన్‌ను ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్‌ను సపోర్టు చేయడం తప్పుకాదా అని నిలదీత..?

## చంద్రబాబు మేలు జరుగుతుందని తెలిసినా అప్పుడు ఎందుకు మౌనం..

అమరావతి, (ప్రజా మంటలు):



ఇటీవల వైఎస్ఆర్ ఆస్తుల విషయంలో మాజీ సీఎం జగన్ ఆమె సోదరి షర్మిల ఆస్తుల విషయంలో కొన్ని రోజులుగా వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో వైఎస్ఆర్ భార్య విజయమ్మ దీనిపై స్పందించి బహిరంగ లేఖ రాయడం తెలిసిందే. అయితే ఆమె స్పందనపై వైసీపీ మాత్రం పెదవి విరుస్తుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉండగా ఆస్తులు పంచలేదని.. ఇప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులే అని వైఎస్ విజయమ్మ చెప్పడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్) ద్వారా సుదీర్ఘ లేఖను విడుదల చేసింది. దివంగత మహానేత వైఎస్ఆర్ భార్యగా, వైసీపీ అధ్యక్షురాలు వైఎస్ జగన్ తల్లిగా విజయమ్మను అమితంగా గౌరవిస్తామని ఆ లేఖలో తెలిపింది. బహిరంగ లేఖ నేపథ్యంలో కొన్ని అంశాలను ఆమె ముందుకు, ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని పేర్కొంది. విజయమ్మ రాసిన లేఖలో జగన్‌ను లీగల్‌గా ఇబ్బంది పెట్టేందుకు, తద్వారా బెయిల్ రద్దుకు జరిగిన కుట్ర వ్యవహారాన్ని కనీసం ప్రస్తావించకపోవడం ప్రజలను పక్కదోవపట్టించడమే అని వైసీపీ తెలిపింది. సరస్వతీ కంపెనీ విషయంలో ఈడీ అటాచ్‌మెంట్ ఉన్నప్పటికీ, తెలంగాణ హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ, యాజమాన్య బదిలీ జరిగేలా క్రయవిక్రయాలు చేయకూడదని, అందుకే అటాచ్‌మెంట్‌లో ఉందనే విషయం అందరికీ తెలిసినప్పటికీ, సరస్వతీ విషయంలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయవద్దని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిలు సహా న్యాయ సలహాలు ఉన్నప్పటికీ, తప్పు అని తెలిసినప్పటికీ మోసపూరితంగా, కుట్రపూరితంగా షేర్లు బదిలీ చేసిన మాట వాస్తవమే కదా? అని ప్రశ్నించింది. షర్మిల భావోద్వేగాలకు, ఒత్తిళ్లకు గురై జగన్‌కు న్యాయపరంగా, చట్టపరంగా చిక్కులు తెచ్చే ఈ పనికి, తెలిసి కూడా విజయమ్మ ఆమోదించి సంతకం పెట్టడం నిజమే కదా అని నిలదీసింది. విజయమ్మ లేఖలో ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించడం ప్రజలను, వైసీపీ అభిమానులను పక్కదోవపట్టించడమే కదా అని చెప్పింది.

2024 ఎన్నికల్లో జగన్ ఒక్కరే ఒకవైపున ఉంటే, అటువైపు చంద్రబాబు నేతృత్వంలో రాజకీయ ప్రత్యర్థులు జట్టుకడితే, మరికొన్ని గంటల్లో ఎన్నికల ప్రచారం ముగుస్తుందనగా, దివంగత మహానేత వైఎస్ఆర్‌ను ఎఫ్ఐఆర్ లో పెట్టిన, తన కుమారుడ్ని అన్యాయంగా 16నెలలు జైల్లోపెట్టిన కాంగ్రెస్‌కు ఓటు వేయండంటూ, వైసీపీని ఇబ్బందిపడుతూ వీడియో విడుదలచేసి విజయమ్మ షర్మిలగారివైపు ఉన్నారనే విషయాన్ని చాలా స్పష్టంగాచెప్పారు. దివంగత మహానేత, వైఎస్సార్ రాజకీయ ప్రత్యర్థులకు, వైఎస్సార్ కుటుంబంపై నిరంతరం కుట్రలు పన్నే చంద్రబాబుకు రాజకీయంగా మేలుచేసే ఇలా వ్యవహరించడం ధర్మమేనా? రాజకీయాలు పక్కనపెడితే ఒక తల్లిగా ఆరోజు విజయమ్మగారు మద్దతు సంగతి దేవుడెరుగు, కనీసం తటస్థవైఖరిని మరిచిపోయి, పక్షపాతం వహించిన వైనంచూసి వైఎస్సార్ అభిమానులు తీవ్రంగా కలతచెందారు, బాధపడ్డారు. ఇప్పుడు షర్మిలగారి భావోద్వేగాలు, ఒత్తిళ్ల ప్రభావంతో, సరస్వతీ కంపెనీ వ్యవహారంలో న్యాయపరంగా ఇబ్బందులు వచ్చి, స్వయంగా ఆమె కుమారుడి బెయిల్ రద్దు కుట్రకు దారితీస్తుందని తెలిసి కూడా మోసపూరితంగా, షేర్ల సర్టిఫికెట్లు పోయాయని చెప్పి, ఒరిజనల్ షేర్ సర్టిఫికెట్ లేకుండా, జగన్ గారి సంతకాలు లేకుండా, ఎవ్వరికీ తెలియకుండా షేర్లను బదిలీచేసి, షర్మిలతోనే విజయమ్మ ఉన్నారని మరోసారి స్పష్టంగా చెప్పారు.

# కరువు మండలాలివే..

## జాబితాను ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

## తగిన చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశం





అమరావతి, (ప్రజా మంటలు):

ఖరీఫ్ సీజన్ 2024కి సంబంధించి ఐదు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 54 మండలాలు కరువు ప్రభావితానికి గురయ్యాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఉన్న ఈ 54 మండలాల్లో వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదు కావడంతో ఈ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ ప్రభుత్వం ఆ జీవోలో తెలిపింది. వీటిలోని 27 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్షం ఉంటే.. మరో 27 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. కలెక్టర్లు ఆయా జిల్లా గెజిట్‌లలో కరువు మండలాలను నోటిఫై చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాలోని నార్పల.. అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాలోని తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల.. అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, చిన్నమండెం, సంబెపల్లె, టి.సుండుపల్లె, రాయచోటి, లక్కిరెడ్డి పల్లె, రామాపురం, వీరబల్లె, తంబళ్లపల్లె, గుర్రంకొండ, కలపడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురుబలకోట, పెద్దతిప్ప సముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె.. చిత్తూరు జిల్లాలోని పెనుమూరు, యాదమర్రి, గుడిపాల మండలాలను తీవ్ర కరువు మండలాలుగా నోటిఫై చేశారు. కర్నూలు జిల్లాలోని కౌతాలం, పెద్దకడుబూరు.. అనంతపురం జిల్లాలోని విడపనకల్, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు.. శ్రీసత్యసాయి జిల్లాలోని కనగానిపల్లి, ధర్మవరం, నంబుల పులకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి.. చిత్తూరు జిల్లాలోని శ్రీరంగరాజపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె, వెంకటగిరికోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాలను కరువు మండలాలుగా గుర్తించారు.

# మహారాష్ట్రలో మూడు స్థానాలకు సీపీఐ(ఎం) అభ్యర్థుల నామినేషన్

## 10,000 మందితో భారీ ర్యాలీ

ముంబాయి, (ప్రజా మంటలు):

మహారాష్ట్రలో మూడు స్థానాలకు సీపీఐ (ఎం) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇండియా బ్లాక్ (ఎంవీఏ)లో భాగంగా దహను, కల్వాన్, షోలాపూర్ సిటీ సెంట్రల్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటీలో నిలిచారు. దహను (ఎస్టీ) నియోజకవర్గంలో ఇండియా బ్లాక్ పార్టీల నేతృత్వంలో 10,000 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ(ఎం) సిట్టింగ్ ఎమ్మెల్యే వినోద్ నికోల్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, నేతలు కిసాన్ గుజార్, మరియం ధావలే, కిరణ్ గహలా, రడ్కా కలంగ్డా, లక్ష్మణ్ డోంబ్రే, లహానీ దౌదా, సునీతా షింగ్డా, ఎన్‌సీపీ నేతలు మిహిర్ షా, వరుణ్ పరేఖ్, తన్మరు బారి, కాశీనాథ్ చౌదరి, కాంగ్రెస్ నేతలు సంతోష్ మోరే, హఫీజు ఖాన్, సుధాకర్ రౌత్, శివసేన నేతలు అజరు ఠాకూర్, సంజరు కాంబ్లే, సంజరు పాటిల్, ఉజ్వల దామ్లే, కష్టకారి సంఘటన నేతలు బ్రియాన్ లోబో, మధు ధోడి, భారత్ జోడో అభియాన్ నాయకులు రాజు భిసే, రమాకాంత్ పాటిల్ పాల్గొన్నారు. కల్వాన్ (ఎస్టీ) నుంచి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జేపీ గవిట్ నామినేషన్ దాఖలు చేశారు. నాసిక్ జిల్లాలోని కల్వాన్‌లో సుర్గానా తహసీల్‌ల నుంచి వేలాది మంది



ప్రజలు, గిరిజన, గిరిజనేతర రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, ఎన్‌సీపీ లోక్‌సభ ఎంపీ భాస్కర్ భాగారే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శిరీష్ కొత్వాల్, శివసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు జయంత్ దిండే, ఎన్‌సీపీ నేత రవీంద్ర దేవ్రే, కాంగ్రెస్ నేత శైలేష్ పవార్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సునీల్ మలుసరే, రాష్ట్ర కమిటీ సభ్యులు సుభాష్ చౌదరి, భికా రాథోడ్, ఇర్ఫాన్ షేక్, ఇంద్రజిత్ గావిత్, ఇంకా సావ్లిరామ్ పవార్, నీలేష్ షిండే పాల్గొన్నారు.షోలాపూర్ కలెక్టరేట్‌కు పార్టీ మాజీ ఎమ్మెల్యే నరసయ్య ఆదాం 12,000 మందికి పైగా కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. బీడీ, పవర్‌లూమ్, నిర్మాణ, రవాణా, అంగన్ వాడీ, ఆశా తదితర రంగాల్లోని కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఉదరు నార్కర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎంహెచ్ షేక్, రాష్ట్ర కమిటీ సభ్యులు నసీమా షేక్, నళిని కల్‌బుర్గి, యూసుఫ్ మేజర్, మాజీ మున్సిపల్ కార్పొరేటర్లు కామిని ఆడమ్, వ్యాంకటేష్ కొంగరి, అడ్వకేట్ అనిల్ వాసం తదితరులు పాల్గొన్నారు.

# చేష్టలుడిగి చూస్తున్న సీసీఐవిస్తరిస్తున్న రిలయన్స్

# మీడియా రంగంలో అడ్డు అదుపులేకుండా విలీనాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (ప్రజా మంటలు):

ఇటీవలి కాలంలో మీడియా రంగంలో విలీనాలు, భాగస్వామ్య ఒప్పందాలు పెద్ద ఎత్తున జరిగిపోతున్నాయి. దేశంలో పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు, పోటీపై ప్రభావం చూపే కార్యకలాపాలను నియంత్రించేందుకు 2003లో ఏర్పడిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చేష్టలుడిగి చూస్తూండి పోవడంతో విలీనాలు, ఒప్పందాలు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి. ఉదాహరణకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్)నే తీసుకుందాం. అది ఓ పారిశ్రామిక గ్రూపు. కానీ ఇప్పుడు మీడియా రంగంలో విస్తరిస్తోంది. ఇందుకు దేశాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వాలే కారణం. మీడియా రంగంలో ఆర్‌ఐఎల్ విస్తరణ సీసీఐ బలహీనతకు అద్దం పడుతోంది. ఇటీవల ఆర్‌ఐఎల్, అతి పెద్ద అంతర్జాతీయ మీడియా సంస్థ డిస్నీకి చెందిన భారతీయ విభాగం చేతులు కలిపాయి. దేశంలోని వివిధ మీడియా సంస్థలను కొనుగోలు చేయడం, వాటితో ఉమ్మడి భాగస్వామ్యాన్ని నెలకొల్పుకోవడం లేదా వాటిలో విలీనం కావడం పేరు ఏదైనా ఈ రంగంలో రిలయన్స్ వేళ్లూనుకుపోతోందని చెప్పడానికి ఇవి ఉదాహరణలు.

తాజాగా ఆర్‌ఐఎల్, వయాకామ్ 18, డిస్నీ చేతులు కలిపాయి. నూతన సంస్థలో వీటికి వరుసగా 16 శాతం, 46 శాతం, 36 శాతం వాటాలు ఉన్నాయి. కానీ ఇది రిలయన్స్ నియంత్రణలోనే ఉంటుంది. ఎందుకంటే వయాకామ్ 18లో మెజారిటీ వాటాలు రిలయన్స్‌వే. వాస్తవానికి గత దశాబ్ద కాలంగా మీడియా, కమ్యూనికేషన్ పరిశ్రమలలో ఆర్‌ఐఎల్ విస్తరిస్తూనే ఉంది. 2012లో టీవీ ప్రసారాలలో ప్రవేశించింది. బహు భాషా వ్యవస్థలను కలిగిన టీవీ-18, ఈటీవీని చేజిక్కించుకుంది. టీవీ వినోద విభాగంలో ముఖ్య భూమిక పోషిస్తున్న వయాకామ్ 18 యాజమాన్యం కూడా రిలయన్స్ చేతికే వచ్చింది. అయినప్పటికీ వార్త, వినోద విభాగాలలో ప్రత్యర్థి నెట్‌వర్క్‌ల ప్రాభవం ఏ మాత్రం మసకబారలేదు. అయితే ఇటీవలి ఒప్పందంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2023లో దేశంలో మొదటి పది స్థానాలలో నిలిచిన ప్రసార సంస్థలలో వయాకామ్ 18, డిస్నీ 40 కూడా ఉన్నాయి. మొత్తం ప్రేక్షకులలో ఈ రెండింటి వాటా కలిపి 40 శాతం దాటింది. 2016లో రిలయన్స్ ఇండస్ట్రీస్ జియోని ప్రారంభించడం ద్వారా మొబైల్ టెలికమ్యూనికేషన్స్ రంగంలో అడుగు పెట్టింది. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల కారణంగా జియో సామ్రాజ్యం విస్తరించింది. మొబైల్ టెలికమ్యూనికేషన్ లైసెన్స్ పొందిన తర్వాత జియో ఇతర మొబైల్ ప్రొవైడర్ల నుండి వినియోగదారులను దూరం చేసింది. అటు సీసీఐ కూడా ఏమీ



చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోయింది. రిలయన్స్, డిస్నీ సంస్థలకు సీసీఐ 100 ప్రశ్నలు సంధించినప్పటికీ అవి ఏమిటో, వాటికి ఆ సంస్థలు ఇచ్చిన సమాధానమేమిటో ఎవరికీ తెలియదు. తాజాగా మూడు సంస్థల మధ్య కుదిరిన భాగస్వామ్య ఒప్పందంతో వాటికి మార్కెట్‌పై పూర్తి ఆధిపత్యం వచ్చింది.

# నేడు హారతులు..లక్ష్మీ పూజలు

## నోములు, వ్రతాలకు నేడే ముఖ్యం

యాదాద్రి భువనగిరి,అక్టోబర్ 30 (ప్రజా మంటలు):
చతుర్దశి నాడు వేకువజామునే తైలాభ్యంగన స్నానం చేసే సంప్రదాయం అనాదిగా వస్తున్నది. అంతేకాదు, నువ్వుల నూనెలో లక్ష్మీ కళలు ఆవహించి ఉంటాయి. చతుర్దశి తెల్లవారు జామున నువ్వులతో తలంటుకొని తలస్నానం చేస్తే లక్ష్మీప్రదం. నరక దుర్గతి నుంచి విముక్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ప్రదోషకాలంలో దీపారాధన చేయాలి. ఈ దీపాలు లక్ష్మీకటాక్షం కలిగించడంతో పాటు పితృదేవతలకు నరకబాధను విముక్తిచేస్తాయని నమ్మకం. దీపావళి నాడు హారతులు ప్రధానమైన వేడుక. పుట్టింటికి వచ్చిన ఆడకూతుళ్లు ఇంట్లో ఉన్న మగవాళ్లందరికీ హారతులు ఇస్తారు. సంప్రదాయబద్ధంగా కొనసాగే ఈ పక్రియ గురువారం సూర్యోదయానికి ముందు చేసుకోవాలని సిద్ధాంతులు సెలవిస్తున్నారు. సూర్యోదయానికి ముందు కుదరని పక్షంలో, వర్జ్యం వెళ్లిపోయిన తర్వాత ఇవ్వొచ్చు. ఏటా అమావాస్య నాడు వచ్చే ఈ పండుగ ఈసారి ఒకేరోజు జరుపుకోనున్నారు. అమావాస్య తిథి గురువారం పరివ్యాప్తమై ఉన్నందున గురువారం ఉదయం హారతులు, సాయంతరం లక్ష్మీపూజలుఉ చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో హారతులు, లక్ష్మీ పూజలు ఒకేరోజు చేసుకోవాలని పంచాంగ కర్తలు



సూచిస్తున్నారు. ఆశ్వీయుజ బహుళ చతుర్దశి, అమావాస్య తిథులు కలిసి వచ్చాయి. రాత్రంతా అమావాస్య తిథి పరివ్యాప్తమై ఉండటంతో దీపావళి గురువారమే చేసుకోవాలి. నోముల విషయంలోనూ పండితులు పలు సూచనలు చేస్తున్నారు. లక్ష్మీపూజలకు ఎలాగైతే సాయంత్రం అమావాస్య ఉండాలన్న నియమం ఉన్నదో.. నోములు నిర్వహించాలంటే సూర్యోదయానికి అమావాస్య తిథి ఉండాలని చెప్తున్నారు. దీపావళి పండుగ విశేషాలలో ముఖ్యమైంది లక్ష్మీపూజలు. వ్యాపారస్తులంతా దీపావళి సాయంత్రం లక్ష్మీదేవికి పూజలు చేసి, కొత్త ఖాతా పుస్తకాలు ప్రారంభిస్తారు. ఒక రకంగా చెప్పాలంటే లక్ష్మీపూజలతోనే కొత్త ఆర్థిక సంవత్సరాన్ని మొదలుపెడతారు. రాత్రిపూట అమావాస్య తిథి ఉన్నప్పుడే లక్ష్మీ పూజలు చేసుకోవాలని పండితులు చెప్తున్నారు. గురువారం సాయంత్రం లక్ష్మీపూజలు చేసుకోవాలని సూచిస్తున్నారు. దీపావళికి కొత్త అల్లుడిని ఇంటికి పిలిచి కొత్తబట్టలు, కానుకలు సమర్పించే సంప్రదాయం తెలుగువారికి ఉంది.

# బౌద్ధ మతంలో విభిన్నంగా దీపావళి

## దీపాల వరుసతో భిక్షులకు స్వాగతం

అమరావతి (ప్రజా మంటలు):
దీపావళికి ఒక్కోచోట ఒక్కో విధమైన కథ ప్రచారంలో ఉంది. అలాగే బౌద్ధంలోనూ ఓ కత ప్రచారంలో ఉంది. ప్రతి ఆషాఢ మాసంలో బౌద్ధ భిక్షువులకు వర్షావాసం ప్రారంభ మవుతుంది. ఆ కాలంలో మూడు నెలల పాటు భిక్షువులు ప్రజల వద్దకు భిక్ష కోసం వెళ్ళరు. అడవుల్లో, గుహల్లో ఉండి... దొరికింది తింటూ, ధ్యానంలో, విద్యలో ప్రత్యేక స్వయం శిక్షణ సాగిస్తారు. ఇలా వర్షావాసం పూర్తి చేసి, ఆశ్వయుజ మాసంలో తిరిగి గ్రామాలకు బయలుదేరుతారు. గ్రామాలకు వచ్చే భిక్షువులకు దారి పొడవునా దీపాలతో ప్రజలు స్వాగతం పలుకుతారు. అదే దీపావళిగా, బౌద్ధుల ధర్మ దీపావళిగా ప్రసిద్ధం చెందింది. బౌద్ధులు మరణాన్ని నిర్వాణం అంటారు. నిర్వాణం అంటే దీపం ఆరిపోవడం. ప్రమిద లోని నూనె, వత్తీ పూర్తిగా మండిన తరువాత ఇక దీపం వెలుగదు. అదే నూనె, అదే వత్తి ఇక ఉండవు. అంటే... అదే దీపాన్ని ఇక ఎప్పటికీ వెలిగించలేం. మనిషి నిర్వాణం తరువాత కూడా అంతే! ఇలా అనిత్యత్వాన్నీ, అనాత్మ వాదాన్నీ దీపంతో పోల్చి చెబుతుంది బౌద్ధం. మరణించిన వ్యక్తి తల దగ్గర దీపం ఉంచే సంప్రదాయం బౌద్ధ భిక్షువుల నిర్వాణం నుంచి పుట్టినదే! స్తూపాల మీద దీపాలు ఉంచే ఆచారం కూడా దాన్నుంచి వచ్చిందే! అందుకే మరణాన్ని దీపం ఆరడంతో పోలుస్తాం. మనుషులు చీకటి నుంచి వెలుగులోకి, వెలుగు నుంచి వెలుగులోకి నడవాలని అంటుంది బౌద్ధం. చీకటి నుంచి వెలుగులోకి నడవడం అంటే అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు పయనించడం అని అర్థం. వెలుగు నుంచి వెలుగులోకి' అంటే 'విజ్ఞానం నుంచి శీలం



వైపు పయనించడం' అని అర్థం. ఇలా మనిషికి శీలం, విజ్ఞానం ఈ రెండూ కలిసి ఉంటేనే పరిపూర్ణత. వేల ఏళ్ల క్రితమే బౌద్ధంలో దీప పూజ మొదలయింది. బౌద్ధ స్తూపాల దగ్గర, బౌద్ధ ఆరామాల్లో వందలాది దీపాలు వెలిగించేవారు. బౌద్ధ ధర్మోపన్యాసాలు, దాన కార్యక్రమాలు జరిగే ప్రదేశాలను దీపాలతో నింపేవారు. తమ గ్రామానికి బుద్ధుడు భిక్షువులతో కలిసి వచ్చిన సందర్భాల్లో ఇంటింటా దీపాలను వెలిగించి, ఆహ్వానం పలికే సంప్రదాయం బలీయంగా సాగింది. ఇల్లు వదలి వచ్చిన సిద్ధార్థుడు ఆరేళ్ళు కృషి చేసి, చివరకు జ్ఞానోదయం పొంది బుద్ధుడయ్యాడు. సారనాథ్‌లో మొదటి వర్షావాసం ముగించి రాజగృహకు వచ్చాడు. ఆ సమయంలో... బుద్ధుడైన తన బిడ్డను కపిలవస్తు నగరానికి తీసుకురావాలని మంత్రుల్ని ఆయన తండ్రి శుద్ధోధనుడు ఆదేశిస్తాడు. చివరకు సిద్ధార్థుడి బాల్య మిత్రుడైన కాలు ఉదాయిని పంపుతాడు. కాలు ఉదాయి బుద్ధుణ్ణి వెంటబెట్టుకొని కపిలవస్తుకు వస్తాడు. ఆ సందర్భంలో బుద్ధునికి శుద్ధోదనుడు దారిపొడవునా దీపాలు వెలిగించి స్వాగతం పలికాడు. ఆ రోజు రాజ్యమంతటా దీపాలు వెలిగించారు. అలా బుద్ధుడి కపిలవస్తు నగర పునరాగమనానికి సంకేతంగా దీపాలవెల్లి బౌద్ధ సంప్రదాయంగా నిలిచిపోయిందని అంటారు.

# ఆ ఏరివేతల వెనుక హెూంశాఖ మంత్రి అమిత్ షా

## కెనడా ప్రభుత్వం ఆరోపణ



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
కెనడాలో ఉన్న సిక్కు వేర్పాటువాదల ఏరివేతకు ప్లాన్ వేసింది భారత హెూంశాఖ మంత్రి అమిత్ షా అని కెనడా ప్రభుత్వం ఆరోపించింది. ప్రధాని మోదీకి సన్నిహితుడైన అమిత్ షా సిక్కు వేర్పాటువాదులను టార్గెట్ చేసినట్లు ఆ దేశం పేర్కొన్నది. కెనడా చేసిన ఆరోపణలను భారత ప్రభుత్వం కొట్టిపారేసింది. ఖలిస్తానీల ఏరివేత వెనుక అమిత్ షా పాత్ర లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. సిక్కు వేర్పాటువాదులను షా టార్గెట్ చేసిన విషయాన్ని కెనడా విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ మారిసన్ తొలుత అమెరికాకు చేరవేశారు. అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రికకు ఆ సమాచారం ఇచ్చింది తానే అని డేవిడ్ పార్లమెంటరీ ప్యానెల్ భేటీలో తెలిపారు. సిక్కు వేర్పాటువాదుల హత్యకు ప్లాన్ వేసిన వ్యక్తి షానేనా అని ఓ జర్నలిస్టు అడిగారని, అయితే ఆ వ్యక్తికి అవునని తాను సమాధానం ఇచ్చినట్లు మారిసన్ తెలిపారు.

# మనలోని చెడును నరకాలి

## మంచితో ముందుకు సాగాలి



తిరుపతి,అక్టోబర్30(ఆర్ఎన్ఎ):
నరకాసురుడు మంచి వంశం నుంచి వచ్చినవాడే. అతను విష్ణుమూర్తి కుమారుడని పురాణ గాథలు చెబుతున్నాయి. నరకాసురుడిలో కొన్ని చెడు ధోరణులు ఏర్పడ్డాయి. అతనికి మురాసురుడు అనే మిత్రుడున్నాడు. మురాసురుణ్ణి నరకుడు సేనానిగా చేసుకున్నాడు. వారిద్దరూ కలిసి ఎన్నో యుద్ధాలు చేశారు. వేలాది మందిని చంపారు. వారిద్దరినీ ఒకేసారి చంపడం కష్టం. కాబట్టి కృష్ణుడు మొదట మురాసురుణ్ణి చంపాడు. కృష్ణుడికి 'మురారి' అనే పేరు రావడానికి కారణం ఇదే! మురాసురుడికి మాయలు తెలుసు. వాటి వల్ల అతని ముందు యుద్ధంలో ఎవరూ నిలబడలేకపోయేవారు. మురాసురుడి వధ తరువాత నరకాసుర వధ తేలికయింది. నరకాసురుణ్ణి విడిచిపెట్టినా అతను పద్ధతుల్ని మార్చుకోడని కృష్ణుడికి తెలుసు. యుద్ధంలో నరకుణ్ణి మృత్యు ముఖానికి తీసుకువచ్చేసరికి, అతనికి జ్ఞానోదయం అయింది. అనవసరంగా చాలా చెడును మూట కట్టుకున్నానని అతను గ్రహించాడు. నువ్వు నన్ను చంపడం లేదు. నాలోని చెడును తొలగిస్తున్నావు. నాకు మంచే చేస్తున్నావు. ఈ విషయం అందరికీ తెలియాలి. నేను పోగు చేసుకున్న దోషాలు నాశనం అవుతున్న ఈ రోజును అందరూ పండుగ చేసుకోవాలి. ఈ రోజు నాకు ఒక కొత్త వెలుగును ఇచ్చింది. ఆ వెలుగు ప్రతి ఒక్కరూ పొందాలి అని కృష్ణుణ్ణి నరకాసురుడు కోరాడు. ఆ విధంగా ఆ రోజు దీపావళి పండుగ అయింది. ఈ రోజు దేశమంతా వెలుగులతో నిండిపోవాలి. ఆ వెలుగు మనలోని మలినాలను కాల్చెయ్యాలి. దానికోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. నేను నిన్ను చంపబోతు న్నాను అని నరకుడికి కృష్ణుడు చెప్పాడు. మనకు అలా చెప్పేవారు ఎవరూ ఉండరు. మనకు తెలియకుండానే అది జరిగిపోవచ్చు. మృత్యువు మనల్ని ఎప్పుడు తీసుకుపోతుందో మనకు చెప్పదు. అది మనిషి రూపంలో రావచ్చు. మరణానికి కారణం బ్యాక్టీరియా, వైరస్ లేదా మనలోని జీవకణాలూ కావచ్చు. అప్పటి వరకూ ఎదురు చూడకుండా ఆత్మావలోకనం చేసుకోవాలి. మనలో విషం పోగు చేసుకుంటున్నామా లేదా దివ్యత్వాన్ని వికసింప జేసుకుంటున్నామా అనేది ఆలోచించాలి. ఎంపిక మన చేతిలోనే ఉంది. ప్రతి ఒక్కరికీ వారి జీవితాన్ని కొనసాగించడానికి కొన్ని ఎంపికలు ఉంటాయి. జీవితంలో ఎదురుదెబ్బలు తగిలే వరకూ ఎదురుచూడకుండా, అలాంటి పరిస్థితి రాకుండా మనల్ని మనం మలచుకోవడం సరైన ఎంపిక. కృష్ణుడు తనను తాను ఆ విధంగా మలచు కున్నాడు. కృష్ణుడి చేతిలో దెబ్బతినే పరిస్థితికి దారితీసే మార్గాలను నరకాసురుడు ఎంచుకున్నాడు. వారిలో ఒకరిని దేవుడిగా పూజిస్తాం. మరొకరిని రాక్షసుడిగా అసహ్యించుకుంటాం. అందుకే, సరైన మార్గంలో జీవితాన్ని మలచుకోవాలి. లేదంటే జీవితం తనదైన పద్ధతుల్లో మనల్ని మలుస్తుంది. ఈ వాస్తవాన్ని దీపావళి గుర్తు చేస్తుంది. మంచి పుట్టుక కలిగి ఉండి కూడా నరకుడు చెడ్డకు ప్రతినిధిగా మారాడు. మరణించే సమయంలో తన స్థితిని అతను గుర్తించాడు. అది ముందే గుర్తించేవారు మరింత ఉన్నతంగా జీవితాలను మలచుకోగలరు. నిర్దిష్టమైన రీతిలో తనను తాను మలచుకోవడానికి మనిషి ఎంతో శ్రమపడాలి. చాలామంది తమకు నిర్బంధాలైపోయిన విషయాలను జీవితపు చివరి క్షణాల వరకూ గ్రహించరు. ముందే వాటి గురించి తెలుసుకోగలిగితే జీవితాలను మెరుగుపరుచుకోవచ్చు. దానికోసం మనలో చైతన్యాన్ని వెలిగించుకోవాలి. ఈ పండుగ సందర్భంగా కాల్చి బూడిద చేయాల్సింది టపాకాయలను కాదు... మనలోని దోషాలనూ, లోపాలనూ! దీపావళి అందించే సందేశం ఇదే!

# ధరలతో కళతప్పుతున పండగలు

## బాణా సంచా ధరల మోత

హైదరాబాద్, (ప్రజా మంటలు):
ధరల నేపథ్యంలో పండగలకు కళ తప్పింది. అన్ని పండగల్లాగే దీపావళి కూడా ఇంటికే పరిమితం కానుంది. బాణాసంచా కాల్చితేనే దీపావళి కాదు. అయితే దీపవాళి ప్రత్యేకతే వేరు. అయితే బాణాసంచా ధరలు కూడా విపరీతంగగా పెరిగాయి. దీపాలతో ఇల్లంతా వెలగించి కొత్త కాంతులను ఆహ్వానించడం ద్వారా పండగ జరుపుకోవాలి. అలాగే ధరలు దాడి చేస్తున్న వేళ కలసి పండగ జరుపుకోవాలని, బాణాసంచా కాల్చాలన్న ఆలోచన నుంచి బయటకు రావాలి. దీపావళి రోజు దీపాలు వెలిగించి, లక్ష్మీపూజలతో, ఇంటి పిండి వంటలకే ప్రాధాన్యం ఇస్తూ పండగ జరుపుకోవడం ఉత్తమం. ఏటా దీపావళి పర్వదినాన్ని పిల్లాపెద్దలు కసలి ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చెడుపై మంచి గెలుపునకు చిహ్నంగా దీపాల పండుగను జరుపుకొంటారు. దీపాల పండుగ



వేడుకలకు ప్రజలు ముందుగానే దీపాలు వెలిగించేందుకు సిద్ధం కావడం ఈ యేడాది విశేషంగా చెప్పుకోవాలి. తగంలో ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు ప్రజలు దీపాలను వెలిగించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు మహిళలు ప్రమిదలను కొనుగోలు చేస్తున్నారు. ధరలు పెరిగిన నేపథ్యంలో పరిమిత ఖర్చుతోనే ప్రజలు గ్రీన్ దీపావళి జరుపుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. పటాసులు కొనుగోలు చేయకుండా మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించి ఆనందాన్ని అందరితో పంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ధరల దెబ్బంతో వెలుగుల పండుగ దీపావళి కళతప్పుతోందన్న భావన రాకుండా దీపాలను వెలగించి పూజలలో భక్తిప్రపత్తులు చాటడం ముఖ్యం. అయితే తారాజువ్వల వెలుగులు, టపాసుల మోతలతో సందడిగా సాగాల్సిన పండుగ రోజు ఈసారి నిశబ్దంగా గడిచిపోనుందన్న భావన పిల్లల్లో ఉండడం సహజం. పర్యావరణహితం కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఏటా పండుగకు వారం ముందునుంచే బాణాసంచా విక్రయాలతో సందడి ప్రారంభమవుతుంది. బాణాసంచా దుకాణాలకు అనుమతి పక్రియలో భాగంగా ఒక్కో దుకాణదారుడు రూ.30వేల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. ఇక ఒక్కో దుకారణదారుడు సుమారు లక్ష నుంచి రూ.5లక్షల వరకు బాణసంచా కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అమ్మకాలు సాగుతాయా లేవా అన్న భయం ఉంది.

# ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ విజ్ఞప్తి

## ఏపీలో ఉన్న వనరుల గురించి విశ్లేషణ

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
అమెరికాలో పర్యటిస్తున్న ఏపీ మంత్రి నారా లోకేష్ లాస్ వెగాస్‌లో నిర్వహిస్తున్న ఐటి సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో పాల్గొన్నారు. వివిధ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని వారికి రిక్వస్ట్ చేశారు. ఏపీలో ఉన్న మానవ వనరులు, భూమి లభ్యత, వాతావరణ పరిస్థితులు వారికి వివరించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరక్టర్ రేచల్ స్కాఫ్‌ను కలిసి ఏపీలో పెట్టుబడుల అవకాశాలు పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు లోకేష్. "క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధనకు నాయకత్వం ఉపకరిస్తుంది. స్మార్ట్ గవర్నెన్స్ కోసం ఎపి ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల అమలులో క్లౌడ్ సేవలు కీలక పాత్ర వహించే అవకాశాలున్నాయి. ఏఐ మిషన్ లెర్నింగ్‌లో మీరు చూపిస్తున్న శ్రద్ధ, నిబద్ధత ఏపీని ఎఐ ఇన్నొవేషన్ కేంద్రంగా మార్చాలన్న మా ఆశయానికి ఊతమిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ సిస్టమ్, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ-గవర్నెన్స్ కార్యకమాలకు సహకారం అందించాలి"అని కోరారు. పెప్సికో మాజీ ఛైర్మన్ సిఇఓ ఇంద్రానూయితో భేటీ అయ్యాను. చంద్రబాబు నేతృత్వంలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు అమలుచేస్తూ వేగవంతమైన అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని వివరించారు. టెక్నాలజీ, తయారీరంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాత్మక కృషిలో పెప్సికో భాగస్వాములు అవ్వాలని కోరారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షిహ్?తో భేటీ అయ్యారు. టెక్ స్టార్టప్?లకు ఏఐ టూల్స్, మెంటార్ షిప్ అందించాలని.. ఏఐ ఆధారిత పరిశ్రమల కోసం యువతకు శిక్షణ ఇవ్వాలని కోరారు. విద్యాసంస్థలతో సేల్స్ ఫోర్స్ సంస్థ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. రెవేచర్ సిఇఓ అశ్విన్ భరత్‌తో



సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్ టాలెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పడానికి రెవేచర్ భాగస్వామ్యం వహించాలని కోరారు. రాష్ట్రంలో నైపుణ్య కార్యక్రమాలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇతర డిమాండ్ ఉన్న ఐటి నైపుణ్యాల్లో యువతకు శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com